

# ప్రజాస్ఫూర్తి

PRAJASPOORTHI TELUGU DAILY

తెలుగు దినపత్రిక

PS NEWS

మేడ్చల్ - మల్కాజిగిరి | ఎడిటర్ - గడ్డమీది బాలరాజు | గురువారం 31-07-2025 | సంపుటి - 24 | సంచిక - 86 | రూ : 4 | పేజీలు:





## నిప్పులు చిమ్ముకుంటూ నింగిలోకి జీఎస్ఎల్వీ–ఎఫ్16..

- విజయవంతంగా కక్ష్యలోకి 'నైసార్'
- నాసా, ఇస్రో సంయుక్తంగా రూపొందించిన ఉపగ్రహం నైసార్
- నైసార్ ను మోసుకెళ్లిన జీఎస్ఎల్వీ-ఎఫ్16
- ప్రయోగం విజయవంతమైందన్న ఇస్రో

అమెరికా అంతరిక్ష పరిశోధన సంస్థ నాసా, భారత అంతరిక్ష పరిశోధన సంస్థ ఇస్రో సంయుక్తంగా రూపొందించిన నైసార్ ఉపగ్రహాన్ని మోసుకుంటూ, భారత వాహన నౌక జీఎస్ఎల్వీ ఎఫ్16 నింగిలోకి దూసుకెళ్లింది. అత్యంత శక్తిమంతమైన అబ్జర్వేషన్ శాటిలైట్ నైసార్ ను విజయవంతంగా కక్ష్యలోకి చేర్చింది. ఈ ఉపగ్రహం బరువు 2,393 కిలోలు. నైసార్ అంటే

తరువాయి 2లో

## ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో పీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ భేటీ

### జూబ్లీహిల్స్‌లోని సీఎం నివాసంలో సమావేశం

- సమావేశంలో పాల్గొన్న రాష్ట్ర కాంగ్రెస్ వ్యవహారాల ఇంఛార్జ్ మీనాక్షి నటరాజన్
- పార్టీ నిర్మాణం, పాదయాత్ర, బీసీ రిజర్వేషన్‌పై చర్చ

తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో రాష్ట్ర కాంగ్రెస్ వ్యవహారాల ఇంఛార్జ్ మీనాక్షి నటరాజన్, పీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ సమావేశమయ్యారు. జూబ్లీహిల్స్‌లోని ముఖ్యమంత్రి నివాసంలో వారు భేటీ అయ్యారు. తెలంగాణలో పార్టీ నిర్మాణం, పాదయాత్ర, బీసీ రిజర్వేషన్‌లపై ఢిల్లీలో పోరాడేందుకు కార్యాచరణపై చర్చించారు. దాదాపు గంటన్నర పాటు ఈ సమావేశం కొనసాగింది. ఈ నెల 31 నుంచి వచ్చే నెల 4 వరకు యథావిధిగా కాంగ్రెస్ పాదయాత్ర నిర్వహించాలని నిర్ణయించారు. ఆగస్టు 5, 6, 7 తేదీల్లో 42 శాతం బీసీ రిజర్వేషన్ల బిల్లు ఆమోదం కోసం ఢిల్లీలో చేపట్టాల్సిన కార్యాచరణ వీరి మధ్య చర్చకు వచ్చింది.

తరువాయి 2లో






## ఏపీలో గూగుల్.. భారీ డేటా సెంటర్...!

- 6 బిలియన్ డాలర్ల పెట్టుబడితో విశాఖ కేంద్రంగా డేటా సెంటర్
- గూగుల్ భారతదేశంలో ఇంత పెద్ద మొత్తంలో పెట్టుబడి పెట్టడం ఇదే మొదటిసారి!
- అంతేకాదు... ఆసియాలోనే ఇదే ఫస్ట్ టైమ్!

గూగుల్ సంస్థ ఏపీలో భారీ డేటా సెంటర్ ఏర్పాటు చేయనున్నట్టు తెలుస్తోంది. 6 బిలియన్ డాలర్లు (దాదాపు రూ.50,000 కోట్లు) పెట్టుబడితో విశాఖ కేంద్రంగా 1 గిగా బైట్ సామర్థ్యంతో ఈ డేటా సెంటర్ ను ఏర్పాటు చేయబోతున్నారు. గూగుల్ భారతదేశంలో ఇంత పెద్ద మొత్తంలో పెట్టుబడి పెట్టడం ఇదే మొదటిసారి. అంతేకాదు,

తరువాయి 2లో

## నాతో డీల్ చేయండి.. ప్రధానమంత్రి వస్తే ఇబ్బంది అవుతుంది!

### : అమిత్ షా ఆసక్తికర వ్యాఖ్యలు

- ఆపరేషన్ సిందూర్‌పై రాజ్యసభలో చర్చ
- చర్చకు ప్రధానమంత్రి హాజరు కాకపోవడాన్ని ప్రశ్నించిన ఖర్గే
- సభ నుంచి వాకౌట్ చేసిన విపక్షాలు



'ఆపరేషన్ సిందూర్'పై రాజ్యసభలో చర్చ సందర్భంగా కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. తనతో డీల్ చేయాలని, ప్రధానమంత్రి వస్తే ఇంకా ఇబ్బందిపడతారంటూ విపక్షాలను ఉద్దేశించి వ్యాఖ్యానించారు. చర్చలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పాల్గొనకపోవడాన్ని విపక్షాలు ప్రశ్నించాయి. కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ప్రధాని మోదీ హాజరు కాకపోవడాన్ని ప్రశ్నించారు. అమిత్ షా ప్రసంగిస్తుండగా విపక్షాలు వాకౌట్ చేశాయి. అమిత్ షా మాట్లాడేందుకు నిలబడగానే విపక్షాలు ఆందోళనకు దిగాయి. సభలో ప్రధానమంత్రి మాట్లాడాలని డిమాండ్ చేశాయి. పీఎం.. పీఎం అంటూ నినాదాలు చేశాయి.

తరువాయి 2లో

## ఏపీలో జీసీసీ ఏర్పాటు చేయండి
## ఏబీమ్ కన్సల్టింగ్ సంస్థను కోరిన మంత్రి




2లో

- సింగపూర్ లో పర్యటిస్తున్న చంద్రబాబు, నారా లోకేశ్, ఇతర మంత్రులు
- ఏబీమ్ కన్సల్టింగ్ మేనేజింగ్ డైరెక్టర్ యానో టోమోకాజుతో మంత్రి లోకేశ్ భేటీ
- విశాఖను ప్రాంతీయ కేంద్రంగా ఎంపిక చేసుకోవాలని సూచన

## అనూహ్య రీతిలో బ్రిటన్ గగనతలం మూసివేత

2లో

# సింగపూర్ పర్యటనలో నాలుగో రోజు సీఎం చంద్రబాబు వరుస భేటీలు
## సింగపూర్ పర్యటనలో సీఎం చంద్రబాబు, మంత్రుల బృందం బిజీబిజీ



- ఇవాళ నాలుగో రోజు పర్యటనలో భాగంగా సీఎం చంద్రబాబు వరుస సమావేశాలు
- కెపిటాల్యాండ్ ఇన్వెస్ట్‌మెంట్, మందాయ్ వైల్డ్ లైఫ్ గ్రూప్, సుమితోమో మిత్సుయ్ బ్యాంకింగ్ కార్పోరేషన్
- టెమసెక్ హోల్డింగ్స్ వంటి సంస్థల ప్రతినిధులతో ముఖ్యమంత్రి వేర్వేరుగా సమావేశం

సీఎం చంద్రబాబు, మంత్రుల బృందం సింగపూర్ పర్యటనలో బిజీబిజీగా ఉంది. ఇవాళ నాలుగో రోజు పర్యటనలో భాగంగా సీఎం చంద్రబాబు వరుస భేటీలు నిర్వహిస్తున్నారు. కెపిటాల్యాండ్ ఇన్వెస్ట్‌మెంట్ (ఇండియా), మందాయ్ వైల్డ్ లైఫ్ గ్రూప్, సుమితోమో మిత్సుయ్ బ్యాంకింగ్ కార్పోరేషన్, టెమసెక్ హోల్డింగ్స్ వంటి సంస్థల ప్రతినిధులతో ముఖ్యమంత్రి వేర్వేరుగా సమావేశమయ్యారు. రియల్ ఎస్టేట్ ప్రాజెక్టులు, ఇండస్ట్రియల్ పార్కులు, డేటా సెంటర్లు, గ్రీన్ బిల్డింగ్స్, డిజటల్ టౌన్ షిప్స్ వంటి అంశాలపై కెపిటాల్యాండ్ ఇన్వెస్ట్‌మెంట్ (ఇండియా) ప్రతినిధులు సంజీవ్ దాస్ గుప్తా, గౌరిశంకర్ నాగభూషణంలతో సీఎం చంద్రబాబు చర్చలు జరిపారు.అమరావతి, విశాఖ, తిరుపతి వంటి నగరాల్లో ఐటీ పార్కుల ఏర్పాటుకు, ప్లగ్ అండ్ ప్లే సదుపాయాలతో కూడిన వర్క్ స్టేషన్ల ఏర్పాటుకు అవకాశం ఉందని సమావేశంలో చంద్రబాబు వివరించారు. తమ సంస్థ నుంచి పెట్టుబడులు పెట్టేందుకు ఏపీని ప్రాధాన్యత కలిగిన రాష్ట్రంగా

తరువాయి 2లో



## సింగపూర్ పర్యటనలో నాలుగో రోజు సీఎం చంద్రబాబు వరుస భేటీలు

(మొదటిపేజీ తరువాయి)

పరిగణిస్తామని కెపిటాల్యాండ్ ఇన్వెస్ట్‌మెంట్ (ఇండియా) ప్రతినిధులు చెప్పారు. వైల్డ్ లైఫ్ పార్కులు, ఎకో టూరిజం, బయో డైవర్సిటీ కాంప్లెక్సులు, వైల్డ్ లైఫ్ ఎక్స్ పీరియెన్స్ జోన్ల ఏర్పాటు వంటి అంశాలపై మందాయ్ వైల్డ్ లైఫ్ గ్రూప్ ప్రతినిధి మైక్ బార్క్ లేతో చంద్రబాబు చర్చించారు. రాష్ట్రంలో ఆయా రంగాల్లో పెట్టుబడులు పెట్టేందుకు బార్క్ లే సముఖత వ్యక్తం చేశారు. పరిశ్రమలు, మౌలిక వసతులు, గ్రీన్ ఎనర్జీ, నగరాభివృద్ధి వంటి రంగాల్లో పెట్టుబడులపై జపాన్ కు చెందిన సుమితోమో మిత్సుయ్ బ్యాంకింగ్ కార్పొరేషన్ఎస్ఎంబీసీ మేనేజింగ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ రాజీవ్ కన్నన్ తో ముఖ్యమంత్రి చర్చలు జరిపారు. వివిధ ప్రాజెక్టుల్లో అవసరమైన ఆర్థిక భాగస్వామ్యంపై ఎస్ఎంబీసీ ప్రతినిధితో చంద్రబాబు మాట్లాడారు. ఇందులో భాగంగా ఫైనాన్స్, ఇన్‌ఫ్రా ప్రాజెక్ట్ లెండింగ్, క్లీన్ ఎనర్జీ ఫైనాన్సింగ్ వంటి రంగాలపై తాము ఆసక్తితో ఉన్నామని చంద్రబాబుకు ఎస్ఎంబీసీ ప్రతినిధి రాజీవ్ కన్నన్ వివరించారు. అలాగే గ్రీన్ ఎనర్జీ, ఫుడ్ ప్రాసెసింగ్, వైద్యారోగ్యం, టెక్నాలజీ, సుస్థిర మౌలిక వసతుల కల్పన వంటి అంశాలపై టెమసెక్ హెల్డింగ్స్ ప్రతినిధి దినేశ్ ఖన్నాతో సీఎం చర్చించారు. దాంతో వివిధ రంగాల్లో పెట్టుబడుల విస్తరణకు తమ కంపెనీ సిద్ధంగా ఉందని దినేశ్ ఖన్నా తెలిపారు. ఏపీలో వివిధ రంగాల్లో పెట్టుబడులు పెట్టే అంశంపై ఎంఓయూలు కుదుర్చుకునే అంశాన్ని పరిశీలిస్తామని దినేశ్ ఖన్నా హామీ ఇచ్చారు.

## ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో పీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ భేటీ

(మొదటిపేజీ తరువాయి)

ఆగస్టు 5న పార్లమెంటు ఉభయసభల్లో ఎంపీల వాయిదా తీర్మానం, చర్చకు పట్టుబట్టాలని నిర్ణయించారు. మరుసటి రోజు అంటే 6న జంతర్ మంతర్ వద్ద నిర్వహించే ధర్నాలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో పాటు మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, పార్టీ నేతలు, బీసీ సంఘాల నేతలు పాల్గొంటారు. 7న రాష్ట్రపతిని కలిసి వినతిపత్రం అందజేస్తారు. ఇందుకోసం ప్రత్యేక రైలులో ప్రతి నియోజకవర్గం నుంచి 50 మంది నేతలు, కార్యకర్తలు ఢిల్లీకి వెళతారు. ఢిల్లీ పర్యటన తర్వాత పాదయాత్ర యథావిధిగా కొనసాగించాలని నిర్ణయించారు.

## నాతో డీల్ చేయండి.. ప్రధానమంత్రి వస్తే ఇబ్బంది అవుతుంది!

(మొదటిపేజీ తరువాయి)

అమిత్ షా స్పందిస్తూ, నరేంద్ర మోదీ కార్యాలయంలోనే ఉన్నారని, ఈ వ్యవహారంపై అన్ని విషయాలను తనతో చెప్పారని నచ్చజెప్పే ప్రయత్నం చేశారు. ప్రధాని సభకు రాకపోతే సభను అవమానించడమేనని ఖర్గే ఆగ్రహం వ్యక్తం చేశారు. పార్లమెంటు ప్రాంగణంలోనే ఉండి సభకు రాకపోవడం సరికాదని ఆయన అన్నారు. అమిత్ షా స్పందిస్తూ, ప్రధానమంత్రి గురించి అడిగే వారి బాధను తాను అర్థం చేసుకోగలనని, కానీ ఆయన కార్యాలయంలోనే ఉన్నారని పేర్కొన్నారు. అన్ని విషయాలపై తాను మాట్లాడి, పూర్తి స్పష్టత ఇస్తున్నప్పుడు ప్రధానమంత్రి నుంచి వినాలని అనుకోవడం ఏమిటని ప్రశ్నించారు. ప్రధానమంత్రి వస్తే మీకు ఇంకా ఇబ్బంది అవుతుందని సున్నితంగా హెచ్చరించారు.

## నిప్పులు చిమ్ముకుంటూ నింగిలోకి జీఎస్ఎల్వీఎఫ్16

(మొదటిపేజీ తరువాయి)

నాసా ఇస్రో సింథటిక్ అపెర్చర్ రాడార్. ఇందులో ఉండే రెండు భారీ డిష్ ల వంటి నిర్మాణాలు భూమిపైకి మైక్రోవేవ్, రేడియో వేవ్ సంకేతాలు పంపుతాయి. ఆ సంకేతాలు భూమిని తాకి పరావర్తనం చెంది తిరిగి శాటిలైట్ ను చేరతాయి. నైసార్ లోని సాంకేతిక వ్యవస్థలు ఆ సంకేతాలను విశ్లేషించి చిత్రాలుగా రూపొందిస్తాయి. ప్రకృతి విపత్తులను ఇది ముందుగానే అత్యంత కచ్చితత్వంతో అంచనా వేస్తుందని భావిస్తున్నారు. ఇస్రో అత్యంత చవకగా రాకెట్ ప్రయోగాలు చేపట్టడం గమనించిన నాసా... ఈ ఉపగ్రహ ప్రయోగం కోసం ఇస్రోతో జట్టుకట్టింది.

## 'నైసార్' ప్రయోగం విజయవంతం... శాస్త్రవేత్తలకు అభినందనలు తెలిపిన సీఎం చంద్రబాబు

* **భారతీయ అంతరిక్ష పరిశోధన రంగంలో కీలక ఘట్టం**
* **నాసా-ఇస్రో సంయుక్తంగా 'నైసార్' ఉపగ్రహ ప్రయోగం**
* **నైసార్ ను విజయవంతంగా కక్ష్యలోకి ప్రవేశపెట్టిన జీఎస్ఎల్వీ-ఎఫ్16**



భారతీయ అంతరిక్ష పరిశోధన రంగంలో మరో కీలక ఘట్టం ఆవిష్కృతమైంది. తొలిసారిగా అమెరికా అంతరిక్ష పరిశోధన సంస్థ నాసా భాగస్వామ్యంతో ఇస్రో ఇవాళ 'నైసార్' అనే భూ పరిశీలన ఉపగ్రహాన్ని విజయవంతంగా ప్రయోగించింది. దీనిపై ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు సోషల్ మీడియాలో స్పందించారు. ఈ మేరకు ట్వీట్ చేశారు. "భారత అంతరిక్ష పరిశోధన సంస్థ (ఇస్రో), నాసా కలిసి ప్రయోగించిన 'నైసార్' ఉపగ్రహాన్ని జీఎస్ఎల్వీఎఫ్16 వాహక నౌక ద్వారా విజయవంతంగా ప్రయోగించిన శాస్త్రవేత్తలకు నా అభినందనలు. తిరుపతి జిల్లాలోని శ్రీహరికోట సతీష్ ధావన్ స్పేస్ సెంటర్ (షార్) నుంచి చేసిన ఈ ప్రయోగం విజయవంతం కావడం తెలుగువారిగా మనకు గర్వకారణం. అత్యంత శక్తివంతమైన ఈ ఎర్త్ అబ్జర్వేషన్ శాటిలైట్ ఎంతో ఉపయుక్తమైనది. శాస్త్ర సాంకేతిక రంగాలలో భారత్ సాధిస్తున్న ప్రగతి మన ఆత్మవిశ్వాసానికి ప్రతీక" అని చంద్రబాబు ఉద్ఘాటించారు.

## ఏపీలో జీసీసీ ఏర్పాటు చేయండి
## : ఏబీమ్ కన్సల్టింగ్ సంస్థను కోరిన మంత్రి నారా లోకేశ్



ఆంధ్రప్రదేశ్‌లో గ్లోబల్ కేపబిలిటీ సెంటర్ (జీసీసీ) ఏర్పాటు చేయాలని ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేశ్ ఏబీమ్ కన్సల్టింగ్ సంస్థను కోరారు. సింగపూర్‌లో ఏబీమ్ కన్సల్టింగ్ మేనేజింగ్ డైరెక్టర్ యానో టోమోకాజుతో మంత్రి లోకేశ్ బుధవారం నాడు భేటీ అయ్యారు. ఈ సందర్భంగా మంత్రి లోకేశ్ మాట్లాడుతూ, విశాఖపట్నం ఐటీతో పాటు డేటా సిటీగా అభివృద్ధి చెందుతోందని, జీసీసీ సెంటర్ల ఏర్పాటుకు అనేక అంతర్జాతీయ సంస్థలు ఆసక్తి చూపుతున్నాయని తెలిపారు. ఇటీవలే ఏఎన్ఎస్ఆర్ సంస్థ విశాఖలో జీసీసీ ఏర్పాటుకు ఎంఓయూ కుదుర్చుకుందని గుర్తుచేశారు. జీసీసీలకు అనుకూలమైన పర్యావరణ వ్యవస్థ విశాఖలో ఉందని, ఏబీమ్ కన్సల్టింగ్ అక్కడ గ్లోబల్ కేపబిలిటీ సెంటర్ ఏర్పాటు చేయాలని లోకేశ్ విజ్ఞప్తి చేశారు. ఆంధ్రప్రదేశ్‌లో నైపుణ్యం కలిగిన శ్రామికశక్తి, వ్యయ ప్రయోజనాలను పరిగణనలోకి తీసుకొని ఏబీమ్ డిజిటల్ ట్రాన్స్‌ఫర్మేషన్ సేవలకు విశాఖను ప్రాంతీయ కేంద్రంగా ఎంపిక చేసుకోవాలని సూచించారు. మంత్రి లోకేశ్ ప్రతిపాదనలకు ఏబీమ్ కన్సల్టింగ్ మేనేజింగ్ డైరెక్టర్ యానో టోమోకాజు సానుకూలంగా స్పందించారు. తమ సంస్థ స్ట్రాటజీ, మేనేజ్‌మెంట్ ఐటీ, డిజిటల్ ట్రాన్స్‌ఫర్మేషన్, ఏఐ, క్లౌడ్, సెక్యూరిటీ, అవుట్‌సోర్సింగ్ సేవలను అందిస్తుందని తెలిపారు. సింగపూర్, థాయ్‌లాండ్, ఇండోనేషియా, మలేషియా, వియత్నాంలో తమ సంస్థకు సుమారు 1,200 మంది నిపుణులైన కన్సల్టెంట్‌లు ఉన్నారని పేర్కొన్నారు. ప్రస్తుతం భారత్‌లో డిజిటల్ ట్రాన్స్‌ఫర్మేషన్, శాప్ ఆధారిత సేవలను అందించడంపై దృష్టి సారిస్తున్నామని, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ప్రతిపాదనలను పరిశీలిస్తామని టోమోకాజు హామీ ఇచ్చారు.

## ఏపీలో గూగుల్ భారీ డేటా సెంటర్... !

(మొదటిపేజీ తరువాయి)

ఆసియాలోనే ఇంత పెద్ద డేటా సెంటర్‌ను ఇంత ఎక్కువ ఖర్చుతో నిర్మించడం ఇదే తొలిసారి. ఈ డేటా సెంటర్‌కు విద్యుచ్ఛక్తి అవసరం కాబట్టి, దానికి సౌరశక్తి (సూర్యరశ్మి నుండి వచ్చే కరెంట్) మరియు పవనశక్తి (గాలి నుండి వచ్చే కరెంట్) కోసం 2 బిలియన్ డాలర్లు ఖర్చు చేయనున్నారు. అంటే, పర్యావరణానికి హాని లేకుండా కరెంట్ తయారు చేసుకుంటారు. భారతదేశంలో డిజిటల్ సేవలు వేగంగా పెరుగుతున్నాయి. ఈ అవకాశాన్ని ఉపయోగించుకోవడానికి గూగుల్ ఈ పెట్టుబడి పెడుతోంది. విశాఖపట్నాన్ని ఎంచుకోవడం వెనుక ఆ ప్రాంతానికి ఉన్న ప్రత్యేకతలు, అలాగే ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఇస్తున్న మద్దతు కూడా కారణం. ఈ పెట్టుబడితో భారతదేశం, ముఖ్యంగా ఆంధ్రప్రదేశ్, టెక్నాలజీ రంగంలో మరింత ముందుకు వెళుతుందని చెప్పవచ్చు. ఏపీ ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేశ్ సింగపూర్ పర్యటనలో టెక్ దిగ్గజాలతో వరుస భేటీలు నిర్వహించడం తెలిసిందే. సింగపూర్ లో నిన్న జరిగిన బిజినెస్ రౌండ్ టేబుల్ సమావేశంలో నారా లోకేశ్... గూగుల్ క్లౌడ్ డైరెక్టర్ డ్రూ బైన్స్ తో సమావేశమయ్యారు. విశాఖలో డేటా సిటీ స్థాపనకు ఏం కావాలా అన్నీ అందుబాటులోకి తెచ్చామని, వీలైనంత త్వరగా గూగుల్ డేటా సెంటర్ ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని లోకేశ్ కోరారు. ఏపీ ప్రతిపాదనలపై ఉన్నతస్థాయిలో చర్చించి నిర్ణయం తీసుకుంటామని బైన్స్ హామీ ఇచ్చారు. ఈ క్రమంలోనే, గూగుల్ భారీ డేటా సెంటర్ ఏర్పాటుకు ముందుకు వచ్చినట్టు తెలుస్తోంది.

## అనూహ్య రీతిలో బ్రిటన్ గగనతలం మూసివేత

* **నేషనల్ ఎయిర్ ట్రాఫిక్ సర్వీసెస్ (ఎన్ఏటీఎస్)లో సాంకేతిక సమస్య**
* **బ్రిటన్ నుంచి బయలుదేరే అన్ని విమానాలు నిలిచిపోయిన వైనం**
* **లండన్ లోని ఆరు విమానాశ్రయాలపై తీవ్ర ప్రభావం**

నేషనల్ ఎయిర్ ట్రాఫిక్ సర్వీసెస్ (ఎన్ఏటీఎస్) లో సాంకేతిక సమస్య కారణంగా బుధవారం సాయంత్రం బ్రిటన్ గగనతలం మొత్తం మూసివేయాల్సి వచ్చింది. ఈ సమస్య వల్ల బ్రిటన్ నుంచి బయలుదేరే అన్ని విమానాలు నిలిచిపోయాయి దీంతో విమానాశ్రయాల్లో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఎన్ఏటీఎస్ ఇంజనీర్లు ఈ సాంకేతిక సమస్యను పరిష్కరించి, లండన్ ప్రాంతంలో సాధారణ కార్యకలాపాలను పునరుద్ధరించినట్లు తెలిపారు.ఈ సమస్య వల్ల సంభవించిన అంతరాయాలను తగ్గించేందుకు విమానయాన సంస్థలు మరియు విమానాశ్రయాలతో కలిసి పనిచేస్తున్నామని ఎన్ఏటీఎస్ తెలిపింది. ఈ అంతరాయం వల్ల ప్రయాణికులకు కలిగిన అసౌకర్యానికి ఎన్ఏటీఎస్ క్షమాపణలు తెలియజేసింది. ఈ సంఘటన లండన్‌లోని హీత్రూ, గాట్విక్, స్టాన్‌స్టెడ్, లూటన్, సిటీ, సౌతెండ్ వంటి ఆరు ప్రధాన విమానాశ్రయాలపై తీవ్ర ప్రభావం చూపింది. హీత్రూ విమానాశ్రయం ప్రపంచంలో అత్యంత రద్దీగా ఉండే విమానాశ్రయాల్లో ఐదవ స్థానంలో, యూరప్‌లో మొదటి స్థానంలో ఉంది. ఈ సాంకేతిక సమస్య కారణంగా వేలాది మంది ప్రయాణికులు ఆలస్యం లేదా రద్దు అయిన విమానాల వల్ల ఇబ్బందులు ఎదుర్కొన్నారు. గతంలో కూడా ఎన్ఏటీఎస్ సిస్టమ్‌లో సాఫ్ట్‌వేర్ సంబంధిత సమస్యలు తలెత్తాయి. 2023 ఆగస్టులో జరిగిన ఒక సాంకేతిక లోపం వల్ల విమాన షెడ్యూల్‌లు మాన్యువల్‌గా ప్రాసెస్ చేయాల్సి వచ్చింది, దీంతో దాదాపు 7,00,000 మంది ప్రయాణికులు ప్రభావితమయ్యారు. ప్రస్తుత సమస్యను త్వరగా పరిష్కరించినప్పటికీ, పూర్తి సాధారణ స్థితి నెలకొనే వరకు కొంత ఆలస్యం తప్పదని అధికారులు తెలిపారు. ప్రయాణికులు తమ విమాన స్థితిని తెలుసుకోవడానికి విమానయాన సంస్థలను, విమానాశ్రయాలను సంప్రదించాలని అలర్ట్ జారీ చేశారు.

## చంద్రుడి వైపు దూసుకెళుతున్న గ్రహశకలం.. ఢీ కొడితే భూమిపైనా ప్రభావం!

* **15 అంతస్తుల భవనమంత పెద్దగా ఉందన్న నాసా**
* **ఈ గ్రహశకలం ఢీ కొంటే చంద్రుడిపై భారీ గుంత ఏర్పడుతుందంటున్న శాస్త్రవేత్తలు**
* **గ్రహశకలం మార్గాన్ని పరిశీలిస్తున్న నాసా జేమ్స్ వెబ్ స్పేస్ టెలిస్కోప్**



అంతరిక్షంలో ఓ గ్రహశకలం చంద్రుడి వైపు దూసుకెళుతోందని నాసా శాస్త్రవేత్తలు పేర్కొన్నారు. దాదాపు 15 అంతస్తుల భవన పరిమాణంలో ఈ గ్రహశకలం ఢీ కొడితే చంద్రుడి ఉపరితలంపై 800 అడుగుల మేర భారీ గుంత ఏర్పడుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. దీని ప్రభావం భూమిపైనా పడుతుందని అంచనా వేశారు. నాసా జేమ్స్ వెబ్ స్పేస్ టెలిస్కోప్ గుర్తించిన ఈ గ్రహశకలాన్ని 2024 వైఆర్4 గా వ్యవహరిస్తున్నారు. ఇది 2032 చంద్రుడిని తాకనుందని చెబుతున్నారు. అయితే, ఈ గ్రహశకలం చంద్రుడిని ఢీ కొట్టే అవకాశం స్వల్పంగానే ఉందని వివరించారు.

**చంద్రుడిని ఢీ కొడితే ఏంజరగనుంది..**

2024 వైఆర్4 గ్రహశకలం చంద్రుడిని ఢీ కొడితే భారీ విస్ఫోటనం ఏర్పడుతుందని, గ్రహశకలం ముక్కలైపోతుందని నాసా శాస్త్రవేత్తలు చెప్పారు. ఈ గ్రహశకలం ముక్కలు భూమివైపు వస్తాయని, వాటివల్ల భూ కక్ష్యలో తిరగుతున్న ఉపగ్రహాలకు ముప్పు పొంచి ఉంటుందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఒక్కొక్కటీ ఒక్కో మీటర్ పరిమాణంలో ఉండే ఈ గ్రహశకలం ముక్కలు కనుక ఢీ కొడితే ఉపగ్రహాలు దెబ్బతింటాయని తెలిపారు. ప్రస్తుతం భూమి చుట్టూ సుమారు 10 వేలకు పైగా యాక్టివ్ ఉపగ్రహాలు తిరుగుతున్నాయని, మరో 25 వేల వరకు అంతరిక్ష వ్యర్థాలు ఉన్నాయని నాసా శాస్త్రవేత్తలు పేర్కొన్నారు. అయితే, 2024 వైఆర్4 గ్రహశకలం చంద్రుడిని ఢీ కొట్టే అవకాశం స్వల్పంగానే ఉండడంతో ముప్పు ఉండకపోవచ్చని వివరించారు.

## బెంగళూరులో ఉగ్ర కలకలం.. మహిళ అరెస్ట్

కర్ణాటక రాజధాని బెంగళూరులో ఉగ్ర కలకలం రేగింది. అల్ ఖైదా అనుబంధ ఉగ్రవాద మాడ్యుల్ కీలక కుట్రదారును పోలీసులు అరెస్టు చేశారు. గుజరాత్ యాంటీ టెర్రరిజం స్క్వాడ్ (ఏటీఎస్) అధికారులు ఈ రోజు ఉదయం ఓ మహిళను అరెస్టు చేశారు. అల్‌ఖైదా టెర్రర్ మాడ్యుల్ మాస్టర్ మైండ్ అయిన షామా పర్వీన్ ను అదుపులోకి తీసుకున్నట్లు ప్రకటించారు. దేశంలో ఉగ్రవాదులకు మద్దతిస్తున్నవారిని గుర్తించడానికి ప్రత్యేక ఆపరేషన్ చేపట్టినట్లు అధికారులు తెలిపారు. ఇందులో భాగంగా జరిపిన సోదాలలో షామా పర్వీన్ కర్ణాటక నుంచి ఉగ్రవాదులకు సహాయ సహకారాలు అందిస్తున్నట్లు గుర్తించి అరెస్టు చేశామన్నారు. కాగా ఈ నెల 23న ఈ మాడ్యుల్ తో సంబంధమున్న మహమ్మద్ ఫర్దీన్, సెపుల్లా కురేషి, జీషన్ అలీ, మహమ్మద్ ఫైక్ లను అదుపులోకి తీసుకున్నట్లు అధికారులు తెలిపారు. వీరితో పాటు దేశవ్యాప్తంగా పలువురు ఉగ్ర అనుమానితులకు షామా పర్వీన్ నాయకత్వం వహిస్తోందని వివరించారు. సోషల్ మీడియాలోని ఆటో డిలీటెడ్ యాప్ ద్వారా వీరంతా సంప్రదింపులు జరుపుతున్నారని, దేశంలోని వివిధ ప్రాంతాల్లో ఉగ్ర దాడులకు కుట్ర చేశారని అధికారులు వివరించారు.



## సింధూ జలాల ఒప్పందం... కీలక ప్రకటన చేసిన జై శంకర్

* **సింధూ జలాల ఒప్పందం అమలు నిలిపివేత కొనసాగుతోందని వెల్లడి**
* **నీరు, రక్తం కలిసి ప్రవహించవని పునరుద్ఘాటన**
* **నెహ్రూ హయాంలో జరిగిన తప్పిదాలను మార్చవచ్చని మోదీ నిరూపించారని వ్యాఖ్య**

పహల్గామ్ ఉగ్రదాడి నేపథ్యంలో సింధూ జలాల ఒప్పందం అమలు నిలిపివేత కొనసాగుతోందని విదేశాంగ శాఖ మంత్రి జై శంకర్ స్పష్టం చేశారు. నీరు, రక్తం కలిసి ప్రవహించలేవని ఆయన పునరుద్ఘాటించారు. బుధవారం నాడు రాజ్యసభలో ఆయన మాట్లాడుతూ, పాకిస్థాన్ ఉగ్రవాదాన్ని విడనాడే వరకు ఈ నిలిపివేత కొనసాగుతుందని తేల్చి చెప్పారు. సింధూ జలాల ఒప్పందం కుదుర్చుకున్న సమయంలో అధికారంలో ఉన్న పాలకులు భారత రైతుల ప్రయోజనాల కంటే పాకిస్థాన్ ప్రయోజనాలకు అధిక ప్రాధాన్యత ఇచ్చారని ఆయన విమర్శించారు. నెహ్రూ హయాంలోని తప్పిదాలను సరిదిద్దలేమని గతంలో 60 ఏళ్లు పాలించిన వారు చెబుతూ వచ్చారని, అయితే మోదీ ప్రభుత్వం వాటిని మార్చవచ్చని నిరూపించిందని అన్నారు. ఆర్టికల్ 370 రద్దు, సింధూ జలాల ఒప్పందంపై తీసుకున్న చర్యలు ఇందుకు నిదర్శనమని ఆయన పేర్కొన్నారు. సింధూ జలాల ఒప్పందానికి అవసరమైన మార్పులు చేస్తున్నట్లు ఆయన తెలిపారు. పహల్గామ్ ఉగ్రదాడికి పాల్పడిన ది రెసిస్టెన్స్ ఫ్రంట్‌ను ఐక్యరాజ్యసమితి తొలిసారి తన నివేదికలో ప్రస్తావించిందని ఆయన గుర్తు చేశారు.

# ప్రభుత్వ భవనాలు, భూములకు రక్షణ కోసం చర్యలు చేపట్టాలి..

*** సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు భూక్యా రమేష్**

ప్రజాస్ఫూర్తి, భద్రాద్రి కొత్తగూడెం : కొత్తగూడెం పట్టణ పరిధిలో ఉన్నటువంటి బస్తీలలో సిపిఎం పార్టీ ప్రతినిధి బృందం ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల పట్ల సర్వే నిర్వహించారు. ఈ సందర్భంగా హనుమాన్ బస్తి లో ఇందిరమ్మ కమ్యూనిటి హాల్ చుట్టూ ఉన్న చెత్తా, చెదారాన్ని సిపిఎం పార్టీ కార్యకర్తలు నాయకులు స్థానిక ప్రజలు శ్రమదానం చేసి శుబ్రం చేయడం జరిగింది. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు భూక్యా రమేష్ మాట్లాడుతూ ప్రభుత్వం తరపున ప్రజలకోసం భవనాలు నిర్మించి, గాలికి వదిలేసినట్లు గా ఉన్నారని విమర్శించారు. భవనాలు అన్ని నాసిరకంగా ఉన్నాయని, ప్రజలకు ఉపయోగం లేని విధంగా భవనాలు నిరుపయోగంగా ఉన్నాయని , వాటిని శుబ్రం చేసి, మౌలిక వసతులు కల్పించాలని ప్రజలకు ఉపయోగపడే విధంగా చేయాలని అధికారులని , ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ప్రజానీకం నిత్యం ఎదుర్కొంటున్న సమస్యలు వెంటనే పరిష్కరించాలనీ డిమాండ్ చేశారు. ప్రధానంగా బస్తీలో ఉన్న డ్రైనేజీలు నెలల తరబడి శుభ్రం చేయట్లేరని ,చెట్లు, చెత్తాచెదారంతో ప్రజలు నిత్యం ఇబ్బందులు పడుతున్నారని, బస్తీలలోకి చెత్త ఎత్తే బండ్లు కూడా సమయానికి రావడం లేదని, కిన్నెరసానీ మంచినీరు పైపులు పగిలిపోయాయని వాటిని మరమ్మత్తులు చేసే వారు రావడంలేదని, తదితర సమస్యలను సిపిఎం నాయకత్వానికి వివరించారు,. కొత్తగూడెం పట్టణంలో మున్సిపాలిటి గా మొనటి వరకు ఉందని , ఇప్పుడు కార్పొరేషన్ ఏర్పాటు అయిందని,అభివృద్ధి కోసమే కృషి చేస్తున్నామని ప్రగల్భాలు పలికిన ప్రభుత్వం ,ప్రజా ప్రతినిధులు వారి మాటలన్నీ నీటి



మూటలుగా ఉన్నాయని విమర్శించారు నిత్యం ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల్ని అధికారులు, సంబంధిత సిబ్బంది పరిష్కరించడం లేదని ఆయన విమర్శించారు. వర్షాకాలంలో ప్రజలు ఎదుర్కొంటున్న అనేక రకాల సమస్యలను వెంటనే పరిష్కారం చేయాలని డ్రైనేజీ చెట్లు శుభ్రం చేసి , రోజువారి పేరుకుపోతున్న చెత్తను ఏరోజుకారోజు తీసివేసే ప్రణాళిక బద్ధమైన చర్యలు తీసుకోవాలని మున్సిపల్ అధికారులని డిమాండ్ చేశారు. వర్షకాలంలో ప్రజలకు ఆరోగ్య సమస్యలు తీవ్రతరం అవుతాయని అన్నారు. స్థానిక ప్రజాప్రతినిధులు సైతం ఏమీ పట్టనట్లుగా వ్యవహరిస్తున్నారని అధికారం ఉంటేనే ప్రజల వద్దకు వెళ్తున్నారనీ, అధికారం లేకుంటే ప్రజలను విస్మరించి వారి ఇష్ట రాజ్యాంగ వ్యవహరిస్తున్నారన్నారు. పార్టీ ల పేరు చెప్పుకుని నాయకులను ప్రజలు గమనిస్తూనే ఉండాలని ఆయన అన్నారు . ఎన్నికలప్పుడే వచ్చి వాగ్దానాలు చేసి ఓట్లు వేయించుకొని ,గెలిచినాక ప్రజలకు ముందు వచ్చే పార్టీలను ,ప్రజాప్రతినిధులను బుద్ధి చెప్పాలని ప్రజలకు హిత బోధన చేసారు. బస్తిలలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై మున్సిపల్ అధికారులు క్షేత్రస్థాయి పరిశీలన చేసి సమస్యలను వెంటనే పరిష్కారం చేయాలని వారు డిమాండ్ చేశారు . స్థానిక మున్సిపల్ పరిధిలో ఉన్న సమస్యలు పరిష్కరించకపోతే భవిష్యత్తులో ఆందోళన ఉధృతం చేస్తామని ఆయన హెచ్చరించారు ఈ పర్యటనలో సిపిఎం సీనియర్ నాయకులు ఎన్ఎస్ రాజు ,సిపిఎం శాఖ కార్యదర్శి గూగులోత్ సక్రాం, గిరి, విజయమోహన్ ,అల్తాఫ్ తదితరులు పాల్గొన్నారు.

## వాతావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరి భాగస్వామ్యం అవసరం

*** కార్పొరేటర్ స్వర్ణరాజ్ శివమణి**




ప్రజాస్ఫూర్తి , కాప్రా : వాతావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరి భాగస్వామ్యం అవసరమని కార్పొరేటర్ స్వర్ణరాజ్ శివమణి అన్నారు. బుధవారం కాప్రా డివిజన్‌లోని సి.యస్. నగర్ కాలనీలో నిర్వహించిన వనమహోత్సవ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా కార్పొరేటర్ స్వర్ణరాజ్ శివమణి హాజరై మొక్కలు నాటారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆకుపచ్చ తెలంగాణ లక్ష్యంగా ముఖ్యమంత్రి అనుముల రేవంత్ రెడ్డి ఆదేశాల మేరకు రాష్ట్రప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా ఈ కార్యక్రమాన్ని చేపడుతోందని అన్నారు. ప్రతి సంవత్సరం జూలై నెలలో వనమహోత్సవాన్ని నిర్వహించడం ఆనవాయితీగా మారిందని, ప్రతి ఒక్కరూ బాధ్యతగా మొక్కలు నాటాలని పిలుపునిచ్చారు. మొక్కలు నాటుదాం - పర్యావరణాన్ని కాపాడుదాం అనే నినాదాన్ని నెరవేర్చాలని ఆకాంక్షించారు.మేడ్చల్ జిల్లా వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ విఠల్ నాయక్ మాట్లాడుతూ మొక్కల పెంపకం వాతావరణంలో ఆక్సిజన్ శాతం పెంచుతుందని ఇది భవిష్యత్తు తరాలకు ఉపయుక్తమవుతుందని వివరించారు.ఈ కార్యక్రమంలో యు బి డి మేనేజర్ లోకేష్, సి.యస్. నగర్ ఆర్ డబ్లు ఏ సభ్యులు వర ప్రసాద్, నాయర్, రచనా రెడ్డి, మణి, డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షుడు కొబ్బనూరి నాగశేషు, జిల్లా ఏ ఎమ్ సి డైరెక్టర్ పూర్ణయాదవ్, కాప్రా డివిజన్ కాంగ్రెస్ నాయకులు పి. పవన్ కుమార్, శ్రీకాంత్ గౌడ్, మల్లారెడ్డి, నరేందర్ గౌడ్, జి. సత్యనారాయణ, టి. శ్రీహరి, శ్రీధర్ రెడ్డి, సంతోష్ చారి, సురేందర్ రెడ్డి, సోమ్ నాథ్, మనోజ్ కుమార్, డివిజన్ యువ కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు జి. అరుణ్ కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

## చిల్డ్రన్ ఇస్లామిక్ ఆర్గనైజేషన్ ఆఫ్ ఇండియా సంస్థ చేస్తున్న కృషిని స్వాగతిస్తున్నాం

*** సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్ కె సాబీర్ పాషా**




ప్రజాస్ఫూర్తి భద్రాద్రి కొత్తగూడెం కొత్తగూడెం పర్యావరణాన్ని కాపాడుకునే బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని, అందుకు మొక్కలు విరివిగా నాటడం వల్ల ప్రకృతి సమతుల్యతను కాపాడుకోవచ్చని సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్ కె సాబీర్ పాషా అన్నారు. పట్టణంలోని ఎస్ సి బి నగర్ మోడ్రన్ ఇక్రా పాఠశాలలో చిల్డ్రన్ ఇస్లామిక్ ఆర్గనైజేషన్ ఆఫ్ ఇండియా సంస్థ చేపట్టిన మిలియన్మొక్కల పంపిణి కార్యక్రమాన్ని బుధవారం సాబీర్ పాషా ప్రారంభించి మాట్లాడారు. వాతావరణంలో వస్తున్న పెను మార్పులకు కారణం సమతుల్యత లోపించడమే నన్నారు. జీవకోటి మనుగడకు మొక్కలు ప్రధానమని ప్రతి ఒక్కరు మొక్కలను నాటడంతోపాటు పరిరక్షించాలని సూచించారు. చిల్డ్రన్ ఇస్లామిక్ ఆర్గనైజేషన్ ఆఫ్ ఇండియా సంస్థ మిలియన్ మొక్కలు పంపేందుకు, నాటేందుకు నిర్ణయం తీసుకోవడం అభినందనీయమని ఈ సంస్థను ప్రతి ఒక్కరు ప్రోత్సహించాలని సూచించారు. కార్యక్రమంలో చంద్రగిరి శ్రీనివాసరావు, ఎస్ కె ఫహీమ్, ప్రిన్సిపాల్ బాసిత్, మొక్కల వెంకటేశ్వర రావు తదితరులు పాల్గొన్నారు.

## గ్రంధాలయంలో వైఫై సేవలు

ప్రజాస్ఫూర్తి భద్రాద్రి కొత్తగూడెం: స్థానిక నూతన గ్రంథాలయంలో వైఫై సేవలు అందుబాటులోకి వచ్చాయి. పోటీ పరీక్షలకు సిద్ధపడే వారు, పాఠకుల కోసం ఈ వైఫై సేవలను గ్రంథాలయ చైర్మన్ పసుపులేటి వీరబాబు బుధవారం సమకూర్చారు. వైఫై సదుపాయం లేక ఇబ్బందులు ఎదురవుతున్న నేపథ్యంలో విద్యార్థులు పాఠకులు చైర్మన్ దృష్టికి ఈ విషయాన్ని తీసుకెళ్లారు. దీనిపై స్పందించిన ఆయన గ్రంథాలయం పై ఆధారపడి చదువుకునే వారి కోసం అప్పటికప్పుడే వైఫై సేవలను అందుబాటులోకి తీసుకొచ్చారు. సమస్యను చెప్పగానే సహృదయంతో అర్థం చేసుకొని వైఫై సౌకర్యాన్ని కల్పించిన చైర్మన్ వీరబాబుకు గ్రంథ పాలకురాలు జి మణిమృదుల విద్యార్థినీ విద్యార్థులతో పాటు పాఠకులు కృతజ్ఞతలు తెలియజేశారు.



## కాంగ్రెస్‌కు జనంలో వస్తున్న ఆదరణ ఓర్వలేక ఏది పడితే అది మాట్లాడుతున్న బిఆర్ఎస్ నేతలు

*** దోచుకున్న సొమ్ము దాచుకోవడానికి కాళ్ల బ్యారంకు వెళ్లిన కెటిఆర్**

*** కాంగ్రెస్ ముస్తాబాద్ మండల అధ్యక్షుడు ఏళ్ల బాల్ రెడ్డి**

ప్రజాస్ఫూర్తి, ముస్తాబాద్: కాంగ్రెస్‌కు జనంలో వస్తున్న ఆదరణ ఓర్వలేక బిఆర్ఎస్ నేతలు ఏది పడితే అది మాట్లాడుతున్నారని కాంగ్రెస్ ముస్తాబాద్ మండల అధ్యక్షుడు ఏళ్ల బాల్ రెడ్డి అన్నారు. ముస్తాబాద్ మండల కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. దోచుకున్న సొమ్ము దాచుకోవడానికి కెటిఆర్ కాళ్ల బ్యారంకి వెళ్లారని విమర్శించారు. బిజెపి, బిఆర్ఎస్ కలిసి చేసుకున్న చీకటి ఒప్పందాలలో తెలంగాణ ప్రజలను వంచించాలనే మీ ఆలోచనలలో మా పాత్ర ఏం ఉంటుందన్నారు. ప్రజలు అసెంబ్లీ ఎన్నికల్లో బిఆర్ఎస్‌ను ఫామ్ హౌస్‌కు పరిమితం చేశారని, ఎంపీ ఎన్నికల్లోనైతే ఏకంగా వంద మీటర్ల గొయ్యి తీసి బొంద పెట్టారని, అయినా బీఆర్ఎస్ నేతలకు బుద్ధి రావడం లేదని అన్నారు. గత బిఆర్ఎస్ హయాంలో వేర్ ఈజ్ సీఎం అనే పోస్టర్లు చూశామని, కానీ ప్రజా ప్రభుత్వం రాష్ట్ర ముఖ్యమంత్రి సిఎం రేవంత్ రెడ్డి నిత్యం ప్రజల్లో ఉంటూ రాష్ట్ర అభివృద్ధికై కృషి చేస్తుంటే బిఆర్ఎస్ నేతలు వ్యాఖ్యలు చేస్తున్నారని, ఇది సరైంది కాదన్నారు. ఉనికి కోల్పోతున్నామని ఏది పడితే అది మాట్లాడటం మానేయాలని హితవు పలికారు. ఇంకా కొందరు జర్నలిజం ముసుగులో తమ నాయకుడు సిఎం రేవంత్ రెడ్డిపై, కలెక్టర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేస్తున్నారని, అయినా తాము సహనంతో ఉన్నామని, అది కోల్పోతే ఎలా ఉంటుందో మీ ఊహకే వదిలేఉత్నామని అన్నారు. ఈ సమావేశంలో మార్కెట్ కమిటీ చైర్మన్ తలారి రాణి నర్సింలు, వైస్ చైర్మన్ వెలుముల రాంరెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి కొండం రాజిరెడ్డి, పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు గజ్జల రాజు, మాజీ ఎంపీటీసీ గుండెల్లి శ్రీనివాస్ గౌడ్, ఎస్సీ సెల్ బిసి సెల్ మండల అధ్యక్షులు తలారి నర్సింలు, శీల ప్రశాంత్, గూడూరు మొర్రాయిపల్లి గ్రామ శాఖ అధ్యక్షులు బాబు కుమార్, సీనియర్ నాయకులు ముద్దం రాజు, ఉచ్చిడి బాల్ రెడ్డి, వేముల సత్యం, యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షులు రంజాన్ నరేష్, ఎన్ఎస్‌యుఐ నాయకులు మిడిదొడ్డి భాను, దశరథం, ఈరవేని శ్రీనివాస్, దుబ్బాక రాజు, కిరణ్, రాజలింగం తదితరులున్నారు.



## ఇల్లందు సబ్ జైలును సందర్శించిన జడ్జి దేవరపల్లి కీర్తి చంద్రిక రెడ్డి

ప్రజాస్ఫూర్తి, ఇల్లందు: ఇల్లందు ప్రిన్సిపాల్ జూనియర్ సివిల్ జడ్జి దేవరపల్లి కీర్తి చంద్రిక రెడ్డి ఇల్లందు సబ్ జైలును బుధవారం సందర్శించారు. అనంతరం పలు రికార్డులు పరిశీలించినారు, ఖైదీలకు మెనూ ప్రకారం సదుపాయాలు అందుతున్నాయో లేవో వారిని అడిగి తెలుసుకున్నారు. వర్షాకాలంలో వ్యాధులు వ్యాప్తి చెందే అవకాశం ఉన్నందున పరిశుభ్రత పాటించాలని ఖైదీలకు సూచనలు చేశారు ,ఆర్థిక స్తోమత లేని ఖైదీలకు ఫ్రీ లీగల్ ఎయిడ్ క్లినిక్ ద్వారా న్యాయవాదిని నియమిస్తాము అని ఈ సందర్భంగా వారు తెలిపినారు. ఈ కార్యక్రమంలో జడ్జి గారితో పాటు సబ్ జైల్ సూపర్డెంట్ ఎన్. చంద్రశేఖర్, హెడ్ వార్డెన్ భుజరంగరాజు సబ్ జైల్ సిబ్బంది కె. శ్రీనివాస్, భాస్కర్, లీగల్ ఎయిడ్ న్యాయవాద , కీర్తి కార్తీక్, కోర్టు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



## డబల్ బెడ్ రూమ్ బాధితులకు న్యాయం చేయాలి

*** జీడిమెట్ల సిఐకి సిపిఐ నాయకులు వినతి**




జీడిమెట్ల, (ప్రజాస్ఫూర్తి) : డబుల్ బెడ్ రూమ్ లు ఇప్పిస్తానని చెప్పి ప్రజల వద్ద లక్షల రూపాయలు వసూలు చేసి మోస పోయిన బాధితులకు న్యాయం చేయాలని సిపిఐ మేడ్చల్ జిల్లా కార్యదర్శి ఉమా మహేష్ అన్నారు. బుధవారం శ్రీధర్ ముదిరాజ్ వద్ద నుండి మోసపోయిన బాధితులకు న్యాయం చేయించాలని సిపిఐ నాయకులు జీడిమెట్ల గడ్డం మల్లేష్ కి బాధితులతో కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజల అవసరాలను ఆసరాగా చేసుకుని గత ప్రభుత్వ హాయంలో కొంతమంది ప్రభుత్వ , ప్రజాప్రతినిధుల సంబంధాలను చూపి డబుల్ బెడ్ రూమ్ లు ఇప్పిస్తానని చెప్పి అమాయక ప్రజల వద్ద నుండి లక్షల రూపాయలను వసూలు చేయడం అది నకిలీగా తెలియడం వల్ల ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. ఈ వ్యవహారం వెనకాల ఉన్న వారందరినీ పట్టుకొని చట్ట ప్రకారం మోసపోయిన బాధితులకు సహాయం చేయాలని, వారికి సాయం అందింతవరకు సిపిఐ మద్దతుగా ఉంటుందని అన్నారు. ఈ సందర్భంగా సిఐ గడ్డం మల్లేష్ మాట్లాడుతూ బాధితులకు చట్ట ప్రకారంగా న్యాయం జరిగేలా చూస్తానని, ఇంకెవరైనా బాధితులు ఉంటే నిర్భయంగా రావాలని అన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు యేసు రత్నం, సిపిఐ మండల కార్యదర్శి కే స్వామి, ఏఐటీయూసీ అధ్యక్షులు హరినాథ్ రావు, సిపిఐ నాయకులు మధు, వెంకట్, తదితరులు పాల్గొన్నారు.

## ఆసుపత్రిలో చికిత్స పొందుతూ వ్యక్తి మృతి



జీడిమెట్ల, (ప్రజాస్ఫూర్తి) : అనారోగ్యంతో భాధపడుతున్న ఓ వ్యక్తి గడ్డి మందు తాగి ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందిన సంఘటన జీడిమెట్ల పోలీస్ స్టేషన్ పరిధిలోచోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పశ్చిమ గోదావరి జిల్లా గణపవరం మండలం, పీపర గ్రామానికి చెందిన శివ వర్మ (28) తెల్లాపూర్ లో నివాసం ఉంటూ ప్రైవేట్ కళాశాలలో నాన్ టీచింగ్ స్టాఫ్ గా పని చేస్తాడు. అయితే ఈ నెల 29న పాఠశాలకు వెళ్తున్నాను అని ఇంట్లో చెప్పి అతడి స్నేహితుడైన ప్రవీణ్ దగ్గరకు మల్లన్న కాలనీ దగ్గరలో ఉన్న తోటకు వచ్చి అక్కడ అతని స్నేహితుడు కలవడానికి వచ్చినాడు శివా వర్మ కు అనారోగ్య సమస్యలు ఉండటం వలన మానసిక ఆందోళన చెంది గడ్డి మందు తాగి నాడు అక్కడే తోటలో పనిచేసే వారు అతనిని శ్రీమేరు హాస్పిటల్ కు తరలించారు చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

## సింగరేణి కాంట్రాక్ట్ కార్మికుల వేతనాలను పెంచాలి

*** ఎస్ సి సి డబ్ల్యూ యు - ఐ ఎఫ్ టి యు**

ప్రజాస్ఫూర్తి, భద్రాద్రి కొత్తగూడెం: సింగరేణి వ్యాప్తంగా సుమారు 30 వేల మంది కాంట్రాక్ట్ కార్మికులు అతి తక్కువ వేతనాలతో ని విధులు నిర్వహిస్తున్నారు. ఈ కార్మికుల వేతనాలు పెంచాలని బుధవారం డైరెక్టర్ పా కొత్తగూడెం కి రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో మెమొరండం ఇవ్వడం జరిగింది ఈ సందర్భంగా యండి. రాసుద్దీన్ సింగరేణి కాలరీస్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు మాట్లాడుతూ అనేక సంవత్సరాలుగా సింగరేణి కాలరీస్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్( ఎస్ సి సి డబ్ల్యూ యు ఐ ఎఫ్ టి యు)* ఆధ్వర్యంలో



అనేక పోరాటాలు చేస్తున్నప్పటికీ సింగరేణి యాజమాన్యం, రాష్ట్ర ప్రభుత్వం వేతనాలు పెంచడం లేదు. కనుక ఇప్పటికైనా తక్షణమే సింగరేణి కాంట్రాక్ట్ కార్మికుల వేతనాలు పెంచాలని డిమాండ్ చేస్తున్నాం. అదేవిధంగా సింగరేణిలో పనిచేసే కాంట్రాక్ట్ కార్మికులకు సి ఎం పి ఎఫ్ వివరాలను ఆన్లైన్ చేస్తానని హామీ ఇచ్చి ఇప్పటివరకు సింగరేణి యాజమాన్యం ఆన్లైన్ చేయలేదు, లెక్కలు చూపించడం లేదు. గత నాలుగు సంవత్సరాలుగా సీ.ఎం. పి.ఎఫ్ చిట్టీలు గాని బుక్స్ గాని ఇవ్వడం లేదు. అదేవిధంగా 2022 సెప్టెంబర్ లో సింగరేణి యాజమాన్యం విడుదల చేసిన సర్క్యులర్ ప్రకారంగా కొన్ని ప్రాంతాలలో కాంట్రాక్ట్ కార్మికులకు కాంట్రాక్టర్లు మొదటి వారంలో వేతనాలు చెల్లించడం లేదన్నారు. మొదటి వారంలో వేతనాలు చెల్లించని కాంట్రాక్టర్ల పైన చర్యలు తీసుకోవాలని అన్నారు. అదేవిధంగా సింగరేణి వ్యాప్తంగా సుమారు 210 మందికి పైగా సులభ్ కాంప్లెక్స్ లలో పనిచేసే వర్కర్స్ కు సులభ్ ఇంటర్నేషనల్ సోషల్ సర్వీస్ ఆర్గనైజేషన్ సంస్థ ఈ.ఎస్.ఐ, ఈ. పి.ఎఫ్, బోనస్, అమలు చేయడం లేదు కనుక ఈ సంస్థను అగ్రిమెంటును తక్షణమే రద్దుచేసి సింగరేణి యాజమాన్యం ఈ.ఎస్.ఐ ఈ పి.ఎఫ్ ,బోనస్ అమలు చేసే సంస్థకు టెండర్ ఇవ్వాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ సి సి డబ్ల్యూ యు ఐ ఎఫ్ టి యు నాయకు లు డి బ్రహ్మానందం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్, గౌని నాగేశ్వరరావు. రాష్ట్ర సహాయ కార్యదర్శి.ఎన్ సంజీవ్ రాష్ట్ర నాయకులు పాల్గొన్నారు.





# ప్రతి ఒక్కరు యోగా చేసే విధంగా ప్రోత్సహించాలి

*** యోగా మాస్టర్ దేవేందర్**

జగద్గిరిగుట్ట, (ప్రజాస్ఫూర్తి): ప్రతి ఒక్కరు యోగా చేసే విధంగా మనం వారిని ప్రోత్సహించాలని యోగా మాస్టర్ దేవేందర్ సాధకులకు సూచించారు. భారతీయ యోగ సంస్థాన్ వ్యవస్థాపకుడు ప్రకాష్ లాల్ 15వ వర్ధంతి సందర్భంగా బుధవారం చింతల్ డివిజన్ పరిధిలోని శ్రీ సాయి కాలనీ లో గల ఉచిత యోగా సెంటర్ లో ఏర్పాటు చేసిన వేడుకలకు యోగా మాస్టర్ దేవేందర్, మాస్టర్ ఆనంద్ లు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ప్రకాష్ లాల్ చిత్ర పటానికి వారు పూలమాలలు వేసి ఘనంగా నివాళ్ళులర్పించారు. అనంతరం మాస్టర్ దేవేందర్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరికి



ఉచితంగా యోగా నేర్పించాలనే లక్ష్యంగా ప్రకాష్ లాల్ ఎన్నో కార్యక్రమాలు నిర్వహించారని, ఢిల్లిలో తన 2ఎకరాల స్థలం ట్రస్ట్ కి విరాళంగా ఇచ్చారని తెలిపారు. జియో, జీవన్ దో అనే నినాదం ప్రతి యొక్క యోగా సాధకుడు ముందుకు వెల్లాలన్నారు. సంస్థ ఆధ్వర్యంలో ఇప్పటివరకు విదేశాలలో, భారత దేశంలో సుమారు 4000 యోగా సెంటర్లు ఉచితంగా యోగా నేర్పిస్తున్నాయని తెలిపారు. సాధకులు సేవా భావంతో సేవా చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మెన్ కన్నెకంటి లక్ష్మణ్, కళ్యాణ్ రావ్, శ్రీనివాస్, లక్ష్మి, ఉమాపార్వతి, రఘురామ రాజు, సాగర్, తదితర యోగా సాధకులు పాల్గొన్నారు.

## కదంబ మొక్కలు అనేవి అన్ని మొక్కలు కంటే ఎక్కువ ఆక్సిజన్ ఇస్తుంది

*** లయన్ అన్నెం కోటిరెడ్డి**



కూకట్ పల్లి, (ప్రజాస్ఫూర్తి) : కదంబ మొక్కలు అనేవి అన్ని మొక్కలు కంటే ఎక్కువ ఆక్సిజన్ ఇస్తుందని లయన్ అన్నెం కోటిరెడ్డి అన్నారు. కూకట్ పల్లిలోని రాందేవ్ రావ్ హాస్పిటల్ ప్రాంగణం లో సనత్ నగర్ లయన్స్ క్లబ్ సభ్యులు , హాస్పిటల్ యాజమాన్యం కలిసి 50 కదంబ మొక్కలు నాటారు. ఈ సందర్భంగా లయన్ అన్నెం కోటిరెడ్డి మాట్లాడుతూ కదంబ మొక్కలు అనేవి చల్లని నీడని ప్రసాదిస్తుంది అని ఎన్నో ఔషధ గుణాలు ఉన్న మొక్కలు అని లయన్ అన్నెం కోటిరెడ్డి పేర్కొన్నారు, ఈ కార్యక్రమంలొ క్లబ్ ప్రెసిడెంట్ లయన్ నాగమల్లేశ్వరావు, లయన్ జీవీ రమణారెడ్డి, లయన్ ఐస్ క్రీమ్ వెంకట్ రెడ్డి, లయన్ శ్రీనివాస్ రెడ్డి, హాస్పిటల్ చేర్మెన్ కమలకర్ రావు, హాస్పిటల్ సీఈఓ యోబు , లయన్ సుజాత , లయన్ నిర్మల తదితరులు పాల్గొన్నారు.

## ఎరువుల పంపిణీ ఎలా జరుగుతుందో బీజేపీ అధ్యక్షుడికి తెలియదు

**: మంత్రి పొన్నం**



బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రామ చంద్రరావు వ్యవసాయం మీద అవగాహన లేకుండా మాట్లాడుతున్నారని రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్ బుధవారం ఒక ప్రకటనలో విమర్శించారు. ఎరువులు పలు రాష్ట్రాల్లో తయారు అయినప్పటికీ అవి రాష్ట్రాల అవసరాల మేరకు తగిన సరఫరా పూర్తిగా కేంద్రం పరిధిలో ఉంటుందని తెలిపారు. ఎరువుల పంపిణీ ఎలా జరుగుతుందో తెలియని రామచంద్రరావు బీజేపీ అధ్యక్షుడిగా ఎలా అయ్యారని ఆయన ప్రశ్నించారు. రాష్ట్రానికి తగినంత ఎరువులు ఇవ్వాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి , వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు లు ఇప్పటికే కేంద్ర ప్రభుత్వానికి పలు మార్లు విజ్ఞప్తి చేశారన్నారు. కేంద్ర ప్రభుత్వం రాష్ట్రానికి సరిపడా ఎరువులు డిమాండ్‌కి తగిన విధంగా సప్లై లేకపోవడం వల్లే రాష్ట్రంలో రైతులకు కొంత మేర ఎరువుల ఇబ్బందులు తలెత్తుతున్నాయని పెర్కొన్నారు. కాగా, ఎరువుల లోటు పై రాష్ట ప్రభుత్వాన్ని బదనాం చేయడం కంటే కూడా బీజేపీ అధ్యక్షుడిగా కేంద్ర ప్రభుత్వ పెద్దలతో మాట్లాడి రైతుల ఇబ్బందులు తొలగించండని మంత్రి పొన్నం ప్రభాకర్ సూచించారు. తెలంగాణ కు 9.80 లక్షల మెట్రిక్ టన్నులు అవసరం కాగా ఇప్పటి వరకు 12 లక్షల మెట్రిక్ టన్నుల యూరియా సరఫరా చేశామని మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. ఈ విషయంలో బీజేపీ అధ్యక్షడు రామచంద్రరావు అసత్య ప్రచారాలు చేస్తున్నారని విమర్శించారు. ఇప్పటి వరకు తెలంగాణ కి వచ్చిన యూరియా వివరాలు మంత్రి వెల్లడించారు. ఏప్రిల్ 2025 లో 1.70 ఎల్ఎంటీ యూరియా సరఫరా ప్రణాళిక వేయగా 1.21 ఎల్ఎంటీ మాత్రమే సరఫరా (29 శాతం లోటు) చేశారన్నారు. మే 2025 లో 1.60 ఎల్ఎంటీ యూరియా సరఫరా కు ప్లాన్‌చేయగా, కేంద్రం నుండి కేవలం 0.88 ఎల్ఎంటీ యూరియా మాత్రమే (45 శాతం లోటు) సరఫరా చేశారని, జూన్ 2025 లో 1.70 ఎల్ఎంటీ యూరియా సరఫరా ప్రణాళిక వేయగా 0.98 ఎల్ఎంటీ (42 శాతం లోటు) మాత్రమే సరఫరా అయిందన్నారు. ఈ జూలై లో 1.60 ఎల్ఎంటీ యూరియా సరఫరా ప్రణాళిక వేయగా 1.28 ఎల్ఎంటీ యూరియా (20 శాతం లోటు) మాత్రమే సరఫరా జరిగిందని తెలిపారు. ఈ సంవత్సరంలో మొత్తం ఏప్రిల్ నుంచి జూలై వరకు 6.60 లక్షల మెట్రిక్ టన్నుల యూరియా ప్రణాళిక చేయగా 4.35 లక్షల మెట్రిక్ టన్నుల యూరియా మాత్రమే సరఫరా చేశారని, ఇంకా 2.25 లక్షల మెట్రిక్ టన్నుల యూరియా లోటు ఏర్పడిన విషయం గమనించాలన్నారు. నెలవారి సరఫరా లోటు పై సీఎం రేవంత్ రెడ్డి ఈనెల 8 న కేంద్ర ఎరువులు, రసాయన శాఖ మంత్రిని కలసి తెలంగాణ ఎరువుల సరఫరా లోటు పై విజ్ఞప్తి చేశారని మంత్రి పొన్నం ప్రభాకర్‌తెలిపారు. ఈ విషయంపై వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు కేంద్ర ప్రభుత్వం దృష్టికి పలుమార్లు తీసుకెల్లి విజ్ఞప్తి చేశారన్నారు. ఇప్పటి వరకు తెలంగాణకు వచ్చిన యూరియా 4.35 లక్షల మెట్రిక్ టన్నులు అయితే బీజేపీ అధ్యక్షులు 12.02 లక్షల మెట్రిక్ టన్నులు సరఫరా చేశామని అసత్య ప్రచారాలు చేసి ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారని విమర్శించారు. రాష్ట్రంలో రోజువారీ యూరియా అమ్మకాలు సగటున 10 నుంచి 13 వేల మెట్రిక్ టన్నుల వరకు ఉన్నాయన్నారు. రైతుల విషయంలో రాజకీయాలు మాని కేంద్ర ప్రభుత్వంతో కేంద్ర మంత్రులు , రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు సంప్రదింపులు జరిపి రైతాంగానికి ఇబ్బందులు రాకుండా చూడాలని కోరారు. తమ ప్రజా పాలన ప్రభుత్వంలో తెలంగాణ రైతాంగానికి ఇబ్బందులు లేకుండా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆధ్వర్యంలో ఎరువుల కొరత లేకుండా అన్ని ఏర్పాట్లు చేస్తున్నామని మంత్రి పొన్నం ప్రభాకర్ పేర్కొన్నారు.

## హైస్కూల్ స్థలంలో నిర్మించిన షాపుల అద్దె హై స్కూల్ కి ఇవ్వాలి

*** నాటి మున్సిపల్ చైర్మన్ , మున్సిపల్ అధికారులు ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలి.**




ప్రజాస్ఫూర్తి, ఇల్లందు : ఇల్లందు పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల (మెయిన్ రోడ్ హై స్కూల్) స్థలంలో నిర్మించిన షాపుల కిరాయిని పాఠశాలకి ఇవ్వాలని, అదే విధంగా షాపుల నిర్మాణ ప్రారంభంలో ఇల్లందు మున్సిపల్ అధికారులు , నాటి చైర్మన్ ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని కోరుతూ బుధవారం ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం (పి.డి.ఎస్.యూ) ఆధ్వర్యంలో ఇల్లందు మున్సిపల్ మేనేజర్ కు , ఇల్లందు మండల విద్యాశాఖ అధికారి (ఎం.ఇ.ఓ) లకు కి వినతి పత్రం ఇవ్వడం జరిగింది. ఈ సందర్భంగా భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పి.డి.ఎస్.యూ ప్రధాన కార్యదర్శి జె గణేష్ మాట్లాడుతూ గత ప్రభుత్వం హరితహారం పేరుతో ప్రభుత్వ పాఠశాల స్థలాలలో మొక్కలు నాటగా, ఇల్లందు పట్టణ నడి ఒడ్డున గల ఎంతో చరిత్ర కల్గిన ప్రభుత్వ ఉన్నత పాఠశాల (మెయిన్ రోడ్ హై స్కూల్) స్థలాన్ని పట్టణ అభివృద్ధి పేరుతో పాఠశాల స్థలంలో షాపులను నిర్మించారు. షాపుల నిర్మాణ ప్రారంభ దశలో విద్యార్థులు, విద్యార్థి సంఘాలు పాఠశాల స్థలం దుర్వినియోగం అయ్యే ప్రమాదం ఉందని, పాఠశాల స్థలంలో విద్యాశాఖ కాకుండా ఇతర ఏ శాఖలు కూడా ఎలాంటి నిర్మాణాలు చేపట్టారాదు అని పాఠశాల స్థలాన్ని పాఠశాల కోసమే వినియోగించుకోవాలని వినతులు, ఆందోళనలు చేపట్టడం జరిగింది. ఈ విషయమై పాఠశాల పూర్వ విద్యార్థులు కూడా స్పందించి తమ అభిప్రాయాలను వ్యక్తం చేశారు. ఈ క్రమంలో నాటి మున్సిపల్ చైర్మన్ , అధికారులు పట్టణ అభివృద్ధికి సహకరించాలని ఆ స్థలంలో నిర్మించిన షాపుల ద్వారా వచ్చే కిరాయిని పాఠశాల అభివృద్ధికి కేటాయిస్తామని హామీ ఇవ్వడం జరిగింది. కానీ షాపులు ప్రారంభమై మూడు సంవత్సరాలు కావస్తున్న నేటికీ అణా పైసా పాఠశాల అభివృద్ధికి కేటాయించలేదు. కొన్ని షాపులు నిరుపయోగంగానే ఉన్నాయి. కావున తక్షణం మూడు సంవత్సరాల కిరాయితోపాటు ఇకనుంచి ఆ షాపుల కిరాయిలను పాఠశాలకే ఇవ్వాలని తెలియజేస్తున్నట్లు, పాఠశాల అభివృద్ధికి సహకరించాలని కోరుతున్నట్లు లేని పక్షంలో ఆందోళన చేపడుతాం వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకుడు వి.విజయ్,ఎస్.సంతోష్. యు.సాయి.పి.శ్రీసంజయ్.బి.చరణ్ బి.ప్రేమ కుమార్ తదితరులు పాల్గొన్నారు.



## చోరీలకు పాల్పడుతున్న దొంగల ముఠా అరెస్టు

*** రూ.3.5 లక్షల విలువైన వస్తువులు స్వాధీనం**

జీడిమెట్ల, (ప్రజాస్ఫూర్తి) : అమాయక ప్రజలను లక్ష్యంగా చేసుకుని మొబైల్ ఫోన్లు, వాహనాలను దొంగిలిస్తున్న ఒక దొంగల ముఠాను జీడిమెట్ల పోలీసులు అరెస్టు చేసి రిమాండ్కు తరలించారు. బుధవారం జీడిమెట్ల పోలీస్ స్టే షన్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో జీడిమెట్ల సీఐ గడ్డం మల్లేష్; డీఐ కనకయ్యలు వివరాలను వెల్లడించారు. కూకట్ పల్లి కి చెందిన ఆర్. వైజయంత్ అలియాస్ వరుణ్ (19), దినబంధు కాలనీ కి చెందిన ఆర్. శివ (21), అంజయ్యనగర్ కు చెందిన ఆర్. నరేష్ నాయక్ అలీయాస్ నరేష్ (23) లు ఈ గ్యాంగ్‌కు చెందిన సభ్యులు మద్యం , గంజాయికి బానిసలు. ప్రతిరోజు సాయంత్రం విష్ణున్‌పురి కాలనీ మెట్రో స్టేషన్ వెనుక, సంగీత్ నగర్, కూకట్‌పల్లి, జగద్గిరిగుట్ట బస్టాప్ ప్రాంతాల్లో సమావేశమయ్యేవారు. మత్తులో, వారు కూకట్‌పల్లి, జీడిమెట్ల, మాధాపూర్, జెఎన్‌టియు, ప్రశాంత్ నగర్, మూసాపేట్ ప్రాంతాల్లో తిరుగుతూ ఒంటరిగా వెళ్తున్న ప్రజలను లక్ష్యంగా చేసుకొని మొబైల్ లో మాట్లాడుతున్న మహిళలపై దాడి చేసి మొబైల్ ఫోన్లు లాక్కొనేవారు. అలాగే వాహన దొంగతనాలు చిన్నతరహా దొంగతనాలకు పాల్పడేవారు. ఈ నేపథ్యంలో బుధవారం కుత్బుల్లాపూర్ మండలానికి చెందిన డీ. అఖిల అనే యువతి తన పని ముగించుకుని హాస్టల్‌కి వెళ్తుండగా, శాపూర్ నగర్ బస్‌స్టాప్ సమీపంలోని శుభం హోటల్ వద్ద, బ్లాక్ కలర్ బైక్‌పై వచ్చిన ఇద్దరు అన్యుల వ్యక్తులు ఆమెను నెమ్మదిగా వెనుక నుండి తోసి, ఆమె చేతిలో ఉన్న మొబైల్‌ను లాక్కొన్నారు. ఈ ఘటనలో ఆమె కుడి చెవికి గాయమైంది. వెంటనే జీడిమెట్ల పోలీసులకు ఫిర్యాదు చేయగా పోలీసులు ఆమె చెప్పిన ప్రకారం బైక్ పై వెనుక కూర్చున్న వ్యక్తి ఎర్ర రంగు షర్టు ధరించి ఉన్నాడని గుర్తించగలదని తెలిపింది. సీనియర్ అధికారుల మార్గదర్శనంలో జీడిమెట్ల పోలీసులు ప్రాంతంలోని అనేక సీసీ టీవి కెమెరాల ఫుటేజ్ విశ్లేషించి, వారి చర్యల పద్ధతి ను పరిశీలించి, పాత కేసుల్లో ఉన్న అనుమానితులను పరిశీలించి, ఈ గ్యాంగ్‌ను గుర్తించి అరెస్ట్ చేశారు. ఈ కేసును సీసీ టీవి ఫుటేజ్ విశ్లేషణ, టెక్నికల్ సర్వైలెన్స్, అనుమానితుల డేటాబేస్ తనిఖీ ద్వారా పోలీసులు చేధించారు ఈ నిందితులు గతంలో కూడా మొబైల్ దొంగతనాలు, వాహన చోరీలు, ఇతర చిన్న నేరాలలో పాలుపంచుకున్నారు. ఈ మేరకు పోలీసులు వారి నుంచి రూ.3.5 లక్షల విలువైన (2) మోటార్ సైకిళ్లు (9) మొబైల్ ఫోన్లు స్వాధీనం చేసుకుని అరెస్టు చేసి రిమాండ్కు తరలించారు. ఈ కేసును బాలానగర్ ఏసీపీ పీ. నరేష్ రెడ్డి ప్రత్యక్ష పర్యవేక్షణలో పరిష్కరించారు.ఈ కేసులో చొరవ చూపి నిందితులను అరెస్ట్ చేసిన పోలీసులు సీఐ జీ.మల్లేష్, డీఐ కనకయ్య, డీఎస్ఐ ఎన్.శ్యామ్ ప్రసాద్, ఎఎస్ఐ ఆర్. శ్రీనివాస్ రెడ్డి , కానిస్టేబుల్స్ ప్రేమ్ కుమార్, టీ. నరేష్, రాజ్ కుమార్, సుబ్బారావు, మోహన్ లను అభినందించారు.



## ఉమ్మడి ఖమ్మం జిల్లా ను బిజెపి అడ్డగా మారుస్తా,

*** బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు ఎన్ రాంచందర్ రావు**



ప్రజాస్ఫూర్తి, ఇల్లందు : ఉగ్రవాదాన్ని పెంచి పోషిస్తున్న పాకిస్తాన్ కు అనుకూలంగా కాంగ్రెస్ బిఆర్ఎస్ మాట్లాడుతూ దేశం పట్ల వారికి ఉన్న చిత్తశుద్ధిని చెప్పకనే చెబుతున్నారని బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రామ్ చందర్ రావుఅన్నారు. గురువారం పట్టణంలోని బిజెపి నాయకులు మురళి గృహంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశం లో ఆయన మాట్లాడారు. బిజెపి పై వ్యతిరేకతతోనే ఆపరేషన్ సిందూర్ పైన రాహుల్ గాంధీ ఇష్టం వచ్చినట్లు మాట్లాడుతున్నారని పేర్కొన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం బీసీ రిజర్వేషన్ పేరుతో ఓ బీసీలకు అన్యాయం చేస్తుందని దుయ్యబట్టారు. 42 శాతం బీసీ రిజర్వేషన్ లో 10 శాతం ముస్లింలకు కేటాయిస్తే ఓబీసీలకు మిగిలేది ఏమిటని ప్రశ్నించారు. కేవలం రాజకీయ మతపరమైన లబ్ధి కోసమే బీసీ రిజర్వేషన్ బిల్లును తెరపైకి తీసుకొచ్చారని తెలిపారు. రాష్ట్రంలో బిజెపికి అవకాశం ఇస్తే బీసీలకు పెద్దపీవేస్తామని రాష్ట్ర అధ్యక్షుడిగా హామీ ఇస్తున్నట్లు స్పష్టం చేశారు. ఖమ్మం నల్గొండ మహబూబ్ నగర్ జిల్లాల్లో బిజెపిని బలోపేతం చేయడమే లక్ష్యంగా పర్యటన చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఇప్పటికే సిపిఎం కు చెందిన క్యాడర్ బిజెపి నేతలతో సంప్రదింపులు చేస్తున్నారని ఉమ్మడి ఖమ్మం జిల్లా గడ్డను బిజెపి అడ్డాగా మారుస్తామని ధీమా వ్యక్తం చేశారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో బిజెపి సత్తా చాటుతుందని అన్నారు. ఈ సమావేశంలో మాజీ ఎంపీ సీతారాం నాయక్, జిల్లా అధ్యక్షుడు బైరెడ్డి ప్రభాకర్ రెడ్డి, పట్టణ అధ్యక్షురాలు సుచిత్ర పాసి, మండల అధ్యక్షుడు బట్టు రమేష్, సేనాపతి మురళీకృష్ణ, నియోజకవర్గ నాయకులు గోపికృష్ణ, మాధవ్, నాగన్న, శాసనాల రామయ్య, తదితరులు పాల్గొన్నారు.

## సమ్మక్క, సారలమ్మ జాతరకు రైల్వే లైన్ ఏర్పాటు చేయాలి

**: ఎంపీ ఈటల**



సమ్మక్క సారలమ్మ జాతరకు రైల్వే లైన్ ఏర్పాటు చేయాలని రైల్వే శాఖను ఎంపీ ఈటల రాజేందర్‌కోరారు. బుధవారం పార్లమెంట్‌లో సమ్మక్క, సారలమ్మ జాతరకు వచ్చే భక్తుల ఇబ్బందులపై ప్రస్తావించారు. ములుగు జిల్లా మేడారం గ్రామంలో ఈ జాతర ప్రతి రెండు సంవత్సరాలకు ఒకసారి జరుగుతుంది. ఇది ఏషియాలోని అతిపెద్ద గిరిజన పండుగ. తెలంగాణతో పాటు పక్క సమీప రాష్ట్రలైన చతీష్ గడ్, మహారాష్ట్ర, ఒరిస్సా నుంచి కోటి మంది భక్తులు జాతర కి వస్తారని తెలిపారు. ఇంత పెద్ద సంఖ్యలో వస్తున్న భక్తులకు రైల్వే లైన్ లేకపోవడంతో భక్తులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు.

## ప్రజల కోసం అడిగిన ప్రశ్నను ద్వేషంగా చిత్రీకరించడం అనుచితం

*** మాజీ కార్పొరేటర్ మాధవరం రంగారావు**

శేరిలింగంపల్లి, (ప్రజాస్ఫూర్తి) : ప్రజల కోసం అడిగిన ప్రశ్నను ద్వేషంగా చిత్రీకరించడం అనుచితమని మాజీ కార్పొరేటర్ మాధవరం రంగారావు అన్నారు. బుధవారం మాజీ కార్పొరేటర్ మాధవరం రంగారావు మాట్లాడుతూ వివేకానంద నగర్ కాలనీ అనుపమ హాస్పిటల్ వెనుక భాగం రోడ్ దెబ్బతిన్నడంతో వర్షాకాలం లోనే రోడ్ పైన వాటర్ నిలబడడముతో కార్లు ,బైకులు పాడైనవీ అని జోనల్ కమిషనర్ కి తెలుపగా స్వయముగా వచ్చి చూసి పది నెలల క్రితం మంజూరు చేయడం జరిగినదని ,కార్పొరేటర్ అధికారులను పనులు ప్రారంభం కాలేదని అడిగినపుడు శంకుస్థాపనకి ఎమ్మెల్యే ఇష్టపడుట లేరని చెప్పినందున స్థానికులను కూడా పంపియడం జరిగిందన్నారు. ఆపుడైన అధికారులకు చెప్పకుండా వాయిదాలు వేసుకుంటూ వెళ్లడం జరిగిందన్నారు. ఎమ్మెల్యే వర్షాలు వచ్చినపుడు నియోజకవర్గం మొత్తం తిరిగే ఓపిక ఉంటది కానీ ఇంటి పక్కన చూడక పోవడానికి గల కారణం ఏమిటని ప్రశ్నించారు. గతంలో కార్పొరేటర్‌ను ప్రభుత్వ కార్యక్రమాల్లో సీఎం



రిలీఫ్ ఫండ్,కల్యాణలక్ష్మి చెక్కులు,బోనాల పండుగ చెక్స్ పంపిణీ కార్యక్రమంలో లో పక్కన పెట్టినవారు, శంకుస్థాపనలకు సమయం ఇచ్చి కార్పొరేటర్ యుఎస్ఎ వెళ్లుతున్నారని తెలుసుకొని కాన్సెల్ చేసి యుఎస్ఎ వెళ్ళినాక శంకుస్థాపనలు చేసుకొని ,స్పోర్ట్స్ సామగ్రి జీహెచ్ఎంసీ అధికారులు 150 కార్పొరేటర్ ల దగ్గర నుండి లెటర్ తీసుకొని మంజూరు చేసిన సామగ్రిని ఎమ్మెల్యే తీసుకొని 25 రోజులు ఇంట్లో పెట్టుకుని కార్పొరేటర్ వచ్చే రెండు రోజుల ముందు పంచడం ఎంతవరకు సబబం అని అన్నారు. ఇప్పుడు ఎమ్మెల్యేను కలవమంటే ఎలా అని అన్నారు డివిజన్ లో పది నెలల నుండి మంజూరైన పనులలో అన్ని కంప్లీట్ అయిపోయినాయని ఈ ఒక్క రోడ్ పనులు మాత్రం మిగిలి పోయాయన్నారు. ఇప్పటికైనా ఎమ్మెల్యే స్పందించి త్వరగా రోడ్ పనులు చేయించాలని కోరారు ఎమ్మెల్యే పార్టీ మరీనా తరువాత కూడా శంకుస్థాపనలకు 30 నిమిషాలు 1 గంట వేచి ఉండడం జరిగిందని రాజకీయంగా లబ్ధి కోసమే అయితే అసత్య ఆరోపణలు చేయాలని అనుకుంటే ఆ రోజే చేసేవాళమని అన్నారు కార్పొరేటర్ ఎప్పుడు డెవలప్మెంట్ గురుంచి పాటుపడతారని అన్నారు .

# ఈడీ విచారణకు హాజరైన నటుడు ప్రకాష్‌రాజ్



హైదరాబాద్: బెట్టింగ్ యాప్‌ల కేసులో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) విచారణ ముమ్మరం చేసింది. ఈ కేసులో సినీనటుడు ప్రకాష్‌రాజ్ బుధవారం ఉదయం బషీర్‌బాగ్‌లోని ఈడీ కార్యాలయంలో విచారణకు హాజరయ్యారు. బెట్టింగ్ యాప్స్ వ్యవహారంలో మనీ లాండరింగ్ జరిగినట్టు ఈడీ అనుమానిస్తోంది. నిందితులుగా ఉన్న పలువురు సినీ ప్రముఖులకు ఈడీ నోటీసులు జారీ చేసింది. రానా జులై 23న విచారణకు రావాలని గతంలో ఈడీ నోటీసు ఇవ్వగా... ఆయన గడువు కోరారు. దీంతో ఆగస్టు 11న హాజరు కావాలని ఈడీ సూచించింది. ఆగస్టు 6న విజయ్ దేవరకొండ, 13న మంచు లక్ష్మి విచారణకు హాజరుకావాలని ఈడీ నోటీసులో పేర్కొంది. బెట్టింగ్ యాప్‌ల ప్రమోషన్లపై గతంలో నమోదైన కేసుల ఆధారంగా ఈడీ దర్యాప్తు చేపట్టింది. పంజాగుట్ట, మియాపూర్, సూర్యాపేట, విశాఖలో నమోదైన కేసుల ఆధారంగా విచారణ కొనసాగిస్తోంది. మొత్తం 29 మంది సినీనటులు, యూట్యూబర్లు, ఇన్‌ఫ్లుయెన్సర్లపై ఎన్‌ఫోర్స్‌మెంట్ కేస్ ఇన్ఫర్మేషన్ రిపోర్ట్ (ఈసీఐఆర్) నమోదు చేసిన సంగతి తెలిసిందే. నిందితులు జంగిల్ రమ్మీ, జీత్‌విన్, లోటస్ 365.. తదితర బెట్టింగ్ యాప్‌లకు ప్రమోషన్లు చేయడం వివాదాస్పదమైంది. వీరి ప్రమోషన్ల ప్రభావంతో పలువురు యువకులు బెట్టింగ్‌లో డబ్బులు పెట్టి మోసపోవడంతోపాటు కొందరు ఆత్మహత్యకు పాల్పడ్డారనే ఆరోపణలున్నాయి. ఈ క్రమంలో బెట్టింగ్ యాప్‌ల నిర్వాహకులు రూ.వేల కోట్ల డబ్బు కొల్లగొట్టినట్టు తెలుస్తోంది. ఆయా ఘటనల నేపథ్యంలో సినీప్రముఖులు, యూట్యూబర్లు, ఇన్‌ఫ్లుయెన్సర్లపై తెలంగాణ పోలీసులు ఇప్పటికే ఐదు ఎఫ్‌ఐఆర్‌లు నమోదు చేశారు. ఆయా కేసుల ఆధారంగా ఈడీ దర్యాప్తు ఆరంభించింది. ప్రమోషన్లు చేసినందుకు బెట్టింగ్ యాప్‌ల నిర్వాహకులు హవాలా మార్గంలో పలువురికి డబ్బు పంపించారనే కోణంలో ఆరా తీస్తోంది. ఇప్పటికే తెలంగాణ పోలీసుల నుంచి ప్రాథమిక దర్యాప్తు వివరాలను ఈడీ సేకరించింది.



## శంషాబాద్ ఎయిర్‌పోర్టులో రూ.40కోట్ల విలువైన గంజాయి పట్టివేత

హైదరాబాద్: శంషాబాద్ ఎయిర్‌పోర్టులో రూ.40 కోట్ల విలువైన హైడ్రోఫోనిక్ గంజాయిని నార్కోటిక్ కంట్రోల్ బ్యూరో అధికారులు పట్టుకున్నారు. బ్యాంకాక్ నుంచి వచ్చిన మహిళా ప్రయాణికురాలి వద్ద 40 కిలోల గంజాయి ఉన్నట్లు అధికారులు గుర్తించారు. దీంతో ఆమెను అదుపులోకి తీసుకొని, గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. బ్యాంకాక్ నుంచి భారత్‌లోని వివిధ ప్రాంతాలకు నేరుగా విమాన సర్వీసులున్నా.. అనుమానం రాకుండా ఉండేందుకు ఆమె బ్యాంకాక్ నుంచి దుబాయ్ మీదుగా భారత్‌కు వచ్చినట్లు అధికారులు తెలిపారు. దీనిపై అధికారులు కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు.

# బీసీ రిజర్వేషన్లపై భాజపా, కాంగ్రెస్‌కు చిత్తశుద్ధి లేదు

**: వినోద్ కుమార్**

హైదరాబాద్: బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు ఇవ్వడంలో భాజపా, కాంగ్రెస్‌కు చిత్తశుద్ధి లేదని భారత రాష్ట్ర సమితి మాజీ ఎంపీ వినోద్ కుమార్ అన్నారు. ప్రధాని మోదీ, ప్రతిపక్షనేత రాహుల్ గాంధీ అనుకుంటే గంటలోపు బిల్లుకు ఆమోదం లభిస్తుందని పేర్కొన్నారు. శాసనసభ, మండలి బిల్లు ఆమోదించిన అంశంపైనే ఆర్డినెన్స్ సాధ్యం కాదని.. కాంగ్రెస్, భాజపాలు బీసీలను ఎందుకు మోసం చేస్తున్నాయని ప్రశ్నించారు. ఇందిరా సహానీ కేసులో సుప్రీంకోర్టు స్పష్టమైన తీర్పు ఇచ్చిందని, చట్టసవరణ చేసి తొమ్మిదో



షెడ్యూల్‌లో చేరిస్తేనే న్యాయపరమైన రక్షణ ఉంటుందని పేర్కొన్నారు. చిత్తశుద్ధి ఉంటే బీసీ రిజర్వేషన్ల కోసం రాహుల్ గాంధీ లోక్ సభలో ప్రైవేట్ బిల్లు పెట్టొచ్చు కదా అని ఎద్దేవా చేశారు. రాహుల్ గాంధీ అడగరు, మోదీ చేయరు, అన్నట్లు కనిపిస్తోందని వ్యాఖ్యానించారు. ఆర్టికల్ 243Dలోని C క్లాజ్‌కు సవరణ చేసినా కూడా బీసీ రిజర్వేషన్లు సాధ్యమవుతుందని వినోద్ తెలిపారు. ముఖ్యమంత్రిగా ఉండి ధర్నాలు అంటూ డ్రామాలు చేయాల్సిన అవసరం లేదని, రాహుల్ గాంధీతో కలిసి వెళ్లి మోదీని అడగాలని సీఎం రేవంత్‌కు సూచించారు. భాజపాకు చిత్తశుద్ధి ఉంటే కేసీఆర్ హయాంలో ఆమోదించిన, రేవంత్ రెడ్డి హయాంలో ఆమోదించిన బిల్లులను తొమ్మిదో షెడ్యూల్‌లో చేర్చాలని డిమాండ్ చేశారు.

# యూరియా కోసం రైతుల తిప్పలు.. భాజపా నేతలు గొప్పలు: మంత్రి తుమ్మల

హైదరాబాద్: వ్యవసాయ రంగంపై కనీస అవగాహన లేకుండా భాజపా నేతలు మాట్లాడుతున్నారని తెలంగాణ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. రాష్ట్రానికి 12 లక్షల మెట్రిక్ టన్నుల యూరియా కేంద్రం సరఫరా చేసిందన్న భాజపా రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రామచందర్‌రావు వ్యాఖ్యలపై మంత్రి స్పందించారు. ఒక రాష్ట్రానికి పార్టీ అధ్యక్షుడిగా ఉంటూ నిజానిజాలు తెలుసుకోకుండా మాట్లాడుతున్నారని అసహనం వ్యక్తం చేశారు. రామచంద్రరావుకు, భాజపాకి తెలంగాణ రైతాంగం పట్ల ఉన్న నిబద్ధతను ఏంటో తెలుస్తోందని ఎద్దేవా చేశారు. రైతుల విషయంలో ఎలాంటి రాజకీయాలకు తావివ్వకూడదని ఎన్నిసార్లు తాను విన్నవించినా.. రామచంద్రరావు వైఖరి మారడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌కి సంబంధించి రాష్ట్ర రైతాంగం యూరియా కోసం క్షేత్రస్థాయిలో తిప్పలు పడుతుంటే చేయని గొప్పలు చేసినట్లుగా చెప్పుకొంటున్నారని, అది వారి అవివేకానికి నిదర్శనమని విమర్శించారు. తెలంగాణకు కేంద్ర ప్రభుత్వం ఈ ఖరీఫ్ సీజన్ మొత్తానికి కేవలం 9.80 లక్షల మెట్రిక్ టన్నుల యూరియా మాత్రమే కేటాయించిందని గుర్తు చేశారు. ఇది తెలియకుండా 12 లక్షల మెట్రిక్ టన్నుల యూరియా సరఫరా చేసిందని చెప్పుకోవడం విడ్డూరంగా ఉందన్నారు. తమ రాజకీయ లబ్ధి కోసం రైతులను తప్పుదోవ పట్టించడం మానుకోవాలని భాజపా నాయకులకు హితవు పలికారు. ఇప్పటికే ఎన్నో సార్లు క్షేత్రస్థాయి పరిస్థితులు, రైతులు ఎదుర్కొంటున్న ఇబ్బందులు, ఇతర లెక్కలతో



సహా కేంద్ర రసాయన ఎరువులశాఖ మంత్రి, రాష్ట్రం నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న కేంద్ర మంత్రి, సహాయ మంత్రికి లేఖలు రాశామని.. తాజాగా రామచంద్రరావుకు కూడా లేఖ రాసినట్లు తుమ్మల పేర్కొన్నారు.

## ఆదిలాబాద్ రిమ్స్‌లో వైద్య విద్యార్థి ఆత్మహత్య

ఆదిలాబాద్: ఆదిలాబాద్‌లోని రిమ్స్‌లో వైద్య విద్యార్థి ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడిన ఘటన కలకలం రేపింది. రాజస్థాన్‌కు చెందిన సాహిల్ చౌదరి (19) ఎంబీబీఎస్ సెకండియర్ చదువుతున్నాడు. ఇవాళ ఉదయం అతడు హాస్టల్ గదిలో ఫ్యాన్‌కు ఉరేసుకున్నట్లు తోటి విద్యార్థులు గుర్తించారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. సాహిల్ ఆత్మహత్యకు గల కారణాలు తెలియాల్సి ఉంది.



## పద్మ అవార్డులకు నామినేషన్ గడువు పెంపు




భారత విశిష్ట పురస్కారాలైన పద్మ అవార్డులకు నామినేషన్స్ కు కేంద్ర ప్రభుత్వం గడువును పొడిగించింది. కేంద్ర హోం మంత్రిత్వ శాఖ 2026 పద్మ అవార్డుల కోసం నామినేషన్/సిఫార్సుల గడువును జులై 31 నుంచి ఆగస్టు 15 వరకు పొడిగిస్తూ ఆదేశాలు జారీ చేసింది. ఈ నామినేషన్‌లు రాష్ట్రీయ పురస్కార్ పోర్టల్ https://awards.gov.in ద్వారా ఆన్‌లైన్‌లో మాత్రమే స్వీకరించబడతాయని తెలిపింది. పద్మ విభూషణ్, పద్మ భూషణ్, పద్మ శ్రీ వంటి పద్మ అవార్డులు భారతదేశంలోని అత్యున్నత పౌర పురస్కారాలలో ఒకటిగా పరిగణించబడతాయి. 1954లో స్థాపించబడిన ఈ అవార్డులు, ప్రతి సంవత్సరం గణతంత్ర దినోత్సవం సందర్భంగా కళ, సాహిత్యం, విద్య, క్రీడలు, వైద్యం, సామాజిక సేవ, విజ్ఞానం, ఇంజనీరింగ్, పబ్లిక్ అఫైర్స్, సివిల్ సర్వీస్, వాణిజ్యం మరియు పరిశ్రమ వంటి వివిధ రంగాలలో చేసిన విశిష్ట సేవలు అసాధారణ విజయాలు సాధించిన వ్యక్తులకు ఇవ్వబడతాయి.

# గొర్రెల పంపిణీ కుంభకోణం.. హైదరాబాద్‌లోని ఆరుచోట్ల ఈడీ సోదాలు

హైదరాబాద్: గొర్రెల పంపిణీ కుంభకోణం కేసులో హైదరాబాద్‌లోని ఆరుచోట్ల ఈడీ సోదాలు చేపట్టింది. పశుసంవర్థక శాఖ మాజీ డైరెక్టర్ రామచందర్ నాయక్, ప్రధాన నిందితుడు మొయినుద్దీన్, పలువురి ఇళ్లలో అధికారులు తనిఖీలు చేశారు. తొలుత ఈ కుంభకోణంపై ఏసీబీ కేసు నమోదు చేసింది. దీని ఆధారంగా ఈడీ మరో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తోంది. గొర్రెల పంపిణీతో రూ.700 కోట్ల అక్రమాలు జరిగినట్లు ఏసీబీ గుర్తించింది. 2015లో అప్పటి రాష్ట్ర ప్రభుత్వం గొర్రెల పంపిణీ పథకాన్ని ప్రారంభించింది. తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా వేల మంది లబ్ధిదారులకు సుమారు రూ.4వేల కోట్ల




విలువైన గొర్రెలను పంపిణీ చేసినట్లు గణాంకాలు చెబుతున్నాయి. ఈ పథకంలో మొదటి నుంచి అధికారులు, దళారులు కుమ్మక్కై నిధులు స్వాహా చేసినట్లు ఏసీబీ దర్యాప్తులో వెల్లడైంది. కొంత మంది విక్రేతలకు డబ్బులు చెల్లించినట్లు రికార్డుల్లో చూపించి, ఆ నిధుల్ని ఈ ముఠా స్వాహా చేసింది. ఈ నిధుల్ని బినామీ ఖాతాల్లోకి మళ్లించి అంతా కలిసి వాటాలు పంచుకున్నట్లు వెల్లడైంది. ఈ కుంభకోణంలో కొందరు పెద్దల పాత్ర కూడా ఉన్నట్లు ఏసీబీ, ఈడీ అనుమానిస్తోంది.

## భూశాస్త్రానికి గేమ్ ఛేంజర్

GSLVF16 రాకెట్ ప్రయోగం విజయవంతం కావడం పట్ల కేంద్రమంత్రి బండి సంజయ్ కుమార్ హర్షం వ్యక్తం చేసారు. నేడు శ్రీహరికోటలోని సతీష్ ధావన్ అంతరిక్ష కేంద్రం నుంచి నిసార్ ఉపగ్రహాన్ని కక్ష్యలోకి ప్రవేశపెట్టిన GSLVF16 ప్రయోగం విజయవంతమైన సందర్భంగా బండి సంజయ్ ఇస్రో, నాసా శాస్త్రవేత్తలను అభినందించారు. GSLVF16 ఉపగ్రహం యొక్క శక్తివంతమైన రాడార్ సాంకేతికతతో NISAR ప్రతి 12 రోజులకు మొత్తం భూగోళాన్ని స్కాన్ చేస్తుందన్నారు. అధిక రిజల్యూషన్ తో, భూ ఉపరితలం మీద, అలాగే మంచుతో కప్పబడిన ఉపరితలాలను, సముద్రాలను చిత్రీకరిస్తుందని



అన్నారు. భూమిపై మారుతున్న వాతావరణ పరిస్థితులు, సహజ విపత్తులను, అడవులను పర్యవేక్షించడానికి ఈ ఉపగ్రహం సహాయపడుతుందని, NISAR భూశాస్త్రానికి తప్పక గేమ్ ఛేంజర్ అవుతుందని బండి సంజయ్ అభిప్రాయ పడ్డారు.

# జోగులాంబ టెంపుల్ అభివృద్ధిపై మంత్రి కీలక ఆదేశాలు

అలంపూర్ జోగులాంబ దేవాలయాన్ని సమగ్రంగా అభివృద్ధి చేయాలని దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ అధికారులను ఆదేశించారు. సచివాలయంలో బుధవారం జోగులాంబ ఆలయ మాస్టర్‌ప్లాన్‌పై ఎండోమెంట్ ఉన్నతాధికారులతో మంత్రి సురేఖ సమీక్షా సమావేశం నిర్వహించారు. ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షులు జిల్లెల చిన్నారెడ్డి, ఎండోమెంటు డిపార్టుమెంటు ప్రిన్స్ పల్ సెక్రటరీ శైలజా రామయ్యర్, కమిషనర్ వెంకటరావు, తెలంగాణ ధార్మిక్ అడ్వయిజర్ గోవింద హరి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి కొండా సురేఖ మాట్లాడుతూ జోగులాంబ ఆలయాల అభివృద్ధి విషయంలో తమ ప్రభుత్వం ఎక్కడా రాజీ పడదని చెప్పారు. రాష్ట్రంలోని అన్ని దేవాలయాల అభివృద్ధికి కృషి చేస్తున్నట్లుగానే ఇక్కడ చేస్తామని వివరించారు. కృష్ణ - తుంగభద్ర నదుల సంగమ ప్రాంతంలో జోగులాంబ శక్తి పీఠం ఉందని, ఈ ఆలయ ప్రగతికి ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. రానున్న రోజుల్లో భక్తులు, సందర్శకులు, పర్యాటకులు పెద్ద సంఖ్యలో వచ్చినా ఆ మేరకు నిర్మాణం ఏర్పాటు చేయాలని అధికారులను



ఆదేశించారు. ఈ టెంపుల్‌ను మూడు విడతల్లో అభివృద్ధి చేస్తున్నామని, మొత్తం రూ. 382.5 కోట్లతో అభివృద్ధి చేపడుతున్నామని మంత్రి కొండా సురేఖ వివరించారు.

## ఎమ్మెల్యే, మాజీ మంత్రి జగదీశ్ రెడ్డి నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డికి మరో సవాల్ విసిరారు

బీఆర్ఎస్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి జగదీశ్ రెడ్డి నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డికి మరో సవాల్ విసిరారు. నాగార్జున సాగర్ నుంచి ఏపీకి నీటి విడుదల చేయడం కాదని, దమ్ముంటే కన్నెపల్లి పంప్ హౌజ్ ను ప్రారంభించాలని ఛాలెంజ్ చేశారు. హెలికాప్టర్ లో ఆగమేఘాల మీద వెళ్ళి నాగార్జునసాగర్ నుండి పులిచింతలకు అక్కడ నుండి ప్రకాశం బ్యారేజ్ కు అక్కడ నుండి సముద్రానికి నీళ్లను పంపడానికి పడ్డ తాపత్రయం ఇక్కడ కన్నెపల్లి పంపుహౌజ్ ప్రారంభించడానికి ఎందుకు లేదని ప్రశ్నించారు. మీడియా సమావేశంలో మాట్లాడిన జగదీశ్ రెడ్డి.. 'కాళేశ్వరం మోటార్లు ఆన్ చెయ్యకుండా తుంగతుర్తి, సూర్యాపేట, కోదాడ రైతులను నాశనం చేస్తున్నారు. కన్నెపల్లి ప్రారంబిస్తే 50 లక్షల ఎకరాలకు నీళ్ళు అందించొచ్చు. కాళేశ్వరం కూలిందని లక్షకోట్లు పోయినయ్ అని దొంగ ప్రచారాలు చేస్తున్నరు, నన్ను రాజీనామా చెయ్యి అని మాట్లాడుతున్నారు. జిల్లాలోని 12 మంది ఎమ్మెల్యేలు రాజీనామా చేసి ఎలక్షన్ కి పోదాం, మీకు దమ్ముందా?' అని ప్రశ్నించారు. 'చంద్రబాబు కడుతున్న బనకచర్లకు అనుమతి వచ్చేలా తెలంగాణ ద్రోహి రేవంత్ రెడ్డి అవకాశం ఇస్తుండు. రేవంత్ ను ముఖ్యమంత్రి చేసిందే మోదీ. రాహుల్ గాంధీకి సోయి లేదు, కేవలం తెలంగాణ



నుండి వచ్చే డబ్బుల మూటల కోసమే రాహుల్ ఆరాటం. 11 సంవత్సరాల మోదీ పాలనలో తెలంగాణకు చేసిందేమి లేదు' అని ఆగ్రహం వ్యక్తం చేసారు. 'రేవంత్ రెడ్డి సహా ఇప్పుడు మంత్రులుగా ఉన్న చాలా మంది బీఆర్ఎస్ హయాంలో మా ఫోన్లు ట్యాప్ అయినాయి అని ప్రచారం చేసుకున్నారు, మరి ఇప్పుడు ఆ కాంగ్రెస్ మంత్రులను సిట్ ఎందుకు పిలవట్లేదు.



# వర్షాల్లో చర్మ సంరక్షణకు..!

**వర్షాన్ని ఆస్వాదించడమంటే ఎవరికైనా ఇష్టమే! అయితే దీని వల్ల అందంపై ప్రతికూల ప్రభావం పడుతుందంటున్నారు నిపుణులు. ఎందుకంటే అప్పటికప్పుడే వర్షం పడడం, ఎండగా ఉండడం, హ్యుమిడిటీ స్థాయిలు ఎక్కువవడం.. ఇలా వెనువెంటనే మారే వాతావరణ పరిస్థితులు అందాన్ని దెబ్బతీస్తాయి. అయితే కొన్ని ఫేస్‌ప్యాక్‌లు వేసుకోవడం వల్ల ఈ కాలంలో చర్మాన్ని సంరక్షించుకోవచ్చంటున్నారు నిపుణులు.**

### రోజ్‌వాటర్‌తో..

* పావుకప్పు రోజ్‌వాటర్‌ని తీసుకొని దానికి టేబుల్‌స్పూన్ చందనం పొడి, పావు చెంచా పసుపుని జత చేసి బాగా కలపాలి. ఈ మిశ్రమాన్ని ముఖానికి అప్లై చేసుకొని అరగంట తర్వాత చల్లటి నీటితో శుభ్రం చేసుకోవాలి. ఈ ప్యాక్ వేసుకోవడం వల్ల ట్యాన్, పొక్కులు.. వంటివి తొలగిపోయి ముఖం నిగారింపును సంతరించుకుంటుంది. పసుపు, చందనంలో ఉన్న ఔషధ గుణాలు చర్మ సంబంధిత అలర్జీలు రాకుండా చేస్తాయి.

### గ్రీన్ టీతో..

* రెండు టేబుల్‌స్పూన్ల గ్రీన్ టీ పొడి తీసుకోవాలి. దీనికి ఒక టేబుల్ స్పూన్ పెరుగు, రెండు చుక్కల బాదం నూనె జత చేసి బాగా కలిసే వరకు బ్లెండర్‌లో వేసి బ్లెండ్ చేయాలి. ఈ మిశ్రమాన్ని ముఖానికి, మెడకు పట్టించాలి. ఆరిన తర్వాత గోరువెచ్చని నీటితో కడిగేయాలి. ఈ మిశ్రమంలో బాదం నూనెకు బదులు మీ చర్మతత్వానికి సరిపడే ఇతర అత్యవసర నూనెల్ని సైతం ఉపయోగించవచ్చు. ఈ ఫేస్‌ప్యాక్ వేసుకోవడం వల్ల దురద, ఇతర చర్మ సంబంధిత సమస్యలు దరిచేరవు అంటున్నారు నిపుణులు.

### పుదీనాతో..

* గుప్పెడు పుదీనా ఆకులను తీసుకొని మెత్తగా చేసుకోవాలి. అరటిపండులో సగభాగాన్ని తీసుకొని దాన్ని కూడా మెత్తగా చేసుకోవాలి. ఈ రెండింటినీ బ్లెండర్‌లో వేసి పేస్ట్‌లా చేసుకొని ముఖానికి అప్లై చేసుకోవాలి. ఫేస్‌ప్యాక్ బాగా ఆరిన తర్వాత చల్లటి నీటితో శుభ్రం చేసుకోవాలి. అరటి చర్మానికి పోషణనిచ్చి తేమను కోల్పోకుండా చేస్తుంది. అలాగే బ్యాక్టీరియా నుంచి చర్మాన్ని రక్షించే గుణాలు పుదీనాలో ఉన్నాయి.

### ముల్లంగితో..

* ముల్లంగిలో సగభాగం తీసుకొని దాన్ని మెత్తని పేస్ట్‌లా చేసుకోవాలి. దీనికి కొద్దిగా నిమ్మరసం జత చేసి బాగా కలుపుకోవాలి. ఈ మిశ్రమాన్ని ముఖానికి రాసుకొని పది నిమిషాల పాటు ఆరనివ్వాలి. తర్వాత కాసేపు మృదువుగా మర్దన చేసుకోవాలి. అనంతరం గోరువెచ్చని నీటితో శుభ్రం చేసుకోవాలి. దీనివల్ల ముఖ చర్మానికి రక్తప్రసరణ బాగా జరుగుతుంది. నిమ్మలో ఉన్న విటమిన్ 'సి' చర్మానికి పోషణనివ్వడంతో పాటు అలర్జీలు రాకుండా చూస్తుంది. ముల్లంగిలో ఉన్న సుగుణాలు ముఖ సౌందర్యాన్ని మెరుగుపరచడంలో సహకరిస్తాయి.

### కోడిగుడ్డు తెల్లసొనతో..

* గుడ్డులోని తెల్లసొనకు చెంచా తేనె జత చేసి బ్లెండ్ చేయాలి. ఈ మిశ్రమాన్ని ముఖానికి దట్టంగా పట్టించాలి. ఆరిన తర్వాత గోరువెచ్చని నీటితో శుభ్రం చేసుకోవాలి. ఈ మిశ్రమం క్లెన్సర్‌గా పనిచేసి ముఖాన్ని శుభ్రం చేస్తుంది. జిడ్డుదనాన్ని తగ్గిస్తుంది.

# మృదువైన పాదాల కోసం..!

**కొంతమందికి కాళ్లు, పాదాల వద్ద ఉండే చర్మం పొడిబారి పొలుసుల్లా కనిపిస్తుంటుంది. సీజన్‌తో సంబంధం లేకుండా కొందరికి ఈ సమస్య ఎదురవుతుంది. అయితే కారణమేదైనా.. కొన్ని ఇంటి చిట్కాలతో పొడిబారిన, పెళుసుబారిన చర్మాన్ని తిరిగి మృదువుగా మార్చుకోవచ్చంటున్నారు నిపుణులు. మరి, అవేంటో చూద్దాం రండి..**






### కొబ్బరినూనెతో..

కొద్దిగా కొబ్బరినూనె తీసుకొని చర్మపు పొరల్లోకి ఇంకే వరకు పాదాలపై మృదువుగా మసాజ్ చేసుకోవాలి. రాత్రంతా పాదాలను ఇలానే వదిలేసి నిద్రపోవాలి. ఇలా చేయడం వల్ల కొద్ది రోజుల్లోనే పాదాలపై చర్మం తిరిగి కోమలంగా మారుతుంది. కొబ్బరినూనె పొడిబారిన, పెళుసుబారిన చర్మానికి తగినంత తేమని అందించి తిరిగి మృదువుగా మారుస్తుంది.

### ఈ స్క్రబ్‌తో..

అరచెంచా నిమ్మరసం, ఆలివ్ ఆయిల్, బ్రౌన్ షుగర్ రెండు చెంచాల చొప్పున ఒక పాత్రలో తీసుకొని బాగా కలపాలి. ఈ మిశ్రమాన్ని కాళ్లు, పాదాల వద్ద పొడిగా మారిన చర్మంపై అప్లై చేసి కాసేపు మృదువుగా మసాజ్ చేయాలి. అనంతరం 15 నుంచి 20 నిమిషాలు ఆరనిచ్చి గోరువెచ్చని నీళ్లతో శుభ్రం చేసుకోవాలి. పొడిగా తుడుచుకొని మాయిశ్చరైజర్ రాసుకోవాలి. తరచూ ఇలా చేయడం వల్ల కొద్ది రోజుల్లోనే ఫలితం కనిపిస్తుంది.

### తేనెతో..

పొడిగా మారిన పాదాలకు తేనె అప్లై చేసి రెండు లేదా మూడు నిమిషాలు మృదువుగా మసాజ్ చేయాలి. తర్వాత 10 నుంచి 15 నిమిషాలు ఆరనిచ్చి నీళ్లతో శుభ్రం చేసుకోవాలి. ఇది చర్మానికి తేమనందించడంతో పాటు మృదువుగానూ మార్చుతుంది.

### కలబందతో..

కొద్దిగా కలబంద గుజ్జు తీసుకొని పాదాలకు అప్లై చేయాలి. 10 నుంచి 15 నిమిషాలు ఆరనిచ్చి గోరువెచ్చని నీళ్లతో శుభ్రం చేసుకోవాలి. ఇలా రోజుకి రెండుసార్ల చొప్పున క్రమం తప్పకుండా చేయడం వల్ల కొద్ది రోజుల్లోనే పాదాలు కోమలంగా మారతాయి.

### ఇవి గుర్తుంచుకోండి..

* కాళ్లు, పాదాలపై గాయాలతో బాధపడేవారు అవి పూర్తిగా తగ్గిన తర్వాతే ఈ చిట్కాలను అనుసరించాలి.
* మరీ వేడిగా ఉన్న నీటితో కాళ్లు, పాదాలు శుభ్రం చేసుకోకూడదు.
* రోజూ స్నానం చేసిన తర్వాత పాదాలకు మాయిశ్చరైజర్ తప్పనిసరిగా రాసుకోవాలి.
* మరీ బిగుతుగా ఉండే సాక్సులు, షూస్, చెప్పులు.. వంటివి ధరించకూడదు.
* ఎక్స్‌ఫోలియేషన్‌కి ఉపయోగించే పరికరాలను ఎప్పటికప్పుడు శుభ్రం చేసుకోవడం తప్పనిసరి.





# గులాబీ మొక్క ఏపుగా పెరగాలంటే..!

**పెరట్లో మనకు ఇష్టమైన మొక్క ఏదంటే గులాబీ అనే చెప్తాం. అందుకే రంగురంగుల గులాబీ పూల మొక్కల్ని పెంచుకుంటుంటారు చాలామంది. ఇంటి ముంగిలికి అందాన్ని తీసుకొచ్చే ఈ పువ్వును ఈ శ్రావణ మాసంలో అమ్మవారికి అర్పించడమూ మనకు అలవాటే! అయితే ఈ మొక్క ఏపుగా పెరగాలని, నిండుగా విరబూయాలని బయటి నుంచి తెచ్చిన ఎరువులు వేస్తుంటారు కొందరు. కానీ ఇంట్లో మనం వృథాగా పడేసే పదార్థాల్లో గులాబీ మొక్క ఎదుగుదలకు కావాల్సిన సకల పోషకాలు లభిస్తాయంటున్నారు నిపుణులు. మరి, అవేంటో తెలుసుకుందాం రండి..**

* అరటి పండ్లను తిని తొక్కల్ని పడేస్తుంటాం. కానీ ఈ తొక్కల్లో పొటాషియం సమృద్ధిగా లభిస్తుంది. ఇది గులాబీ మొక్క ఎదుగుదలకు కావాల్సిన పోషణను అందించి పూల ఉత్పత్తిని పెంచుతుంది. కాబట్టి అరటి తొక్కల్ని చిన్న చిన్న ముక్కలుగా కట్ చేసి గులాబీ మొక్క మొదట్లో వేయండి. అవి భూమిలో కలిసిపోయి మొక్కకు కావాల్సిన పోషణను అందిస్తాయి.
* ఆవు పేడలో నైట్రోజన్, ఫాస్ఫరస్, పొటాషియం.. వంటి అత్యవసర పోషకాలుంటాయి. ఇవి మట్టి నాణ్యతను పెంచడంలో దోహదం చేస్తాయి. అలాగే మొక్కకు పోసిన నీటిని పీల్చుకొని ఎక్కువ సమయం తేమగా ఉండేలా చేస్తాయి. కాబట్టి గులాబీ మొక్క నాటేటప్పుడు ఉపయోగించే మట్టిలో కాస్త పేడ కలుపుకోవడం లేదంటే మొక్క మొదట్లో కొద్దిగా ఆవు పేడను చల్లడం.. వంటివి చేస్తే ఫలితం ఉంటుంది. ప్రస్తుతం ఈ పేడ పొడి రూపంలో దొరుకుతోంది.
* మార్కెట్లో లభించే బోన్ మీల్ పౌడర్‌ని గులాబీ మొక్కకు ఎరువుగా వేయచ్చంటున్నారు నిపుణులు. ఇందులో అధిక మొత్తంలో ఉండే ఫాస్ఫరస్ మొక్క ఆరోగ్యంగా ఎదగడానికి, పూల ఉత్పత్తిని పెంచడానికి ఉపయోగపడుతుంది.
* కాఫీ, టీ పొడి పిప్పిని పడేస్తుంటారు చాలామంది. కానీ వాటిని మొక్క మొదట్లో వేస్తే దానికి ఎరువుగా పనికొస్తుందంటున్నారు నిపుణులు. ఇందులో ఉండే నైట్రోజన్, ట్యానిన్లు గులాబీ పువ్వులు విరగబూసేలా చేస్తాయని చెబుతున్నారు.
* వృథా అంటూ గుడ్డు పెంకుల్ని పడేస్తుంటాం.. కానీ వీటితో బహుళ ప్రయోజనాలున్నాయి. క్యాల్షియం అధికంగా ఉండే ఈ పెంకులు మొక్క చీడపీడల బారిన పడకుండా కాపాడి ఆరోగ్యంగా ఎదిగేలా చేస్తుంది. కాబట్టి గుడ్డు పెంకుల్ని క్రష్ చేసి ఈ పొడిని మొక్క మొదట్లో వేస్తే.. అది ఆ మట్టిలో కలిసిపోయి మొక్కకు పోషణను అందిస్తుంది.
* వీటితో పాటు కాయగూరల వ్యర్థాలతో ఇంట్లో తయారుచేసే కంపోస్ట్ ఎరువును కూడా గులాబీ మొక్కలకు వాడచ్చు.



# భారత్-అమెరికా ట్రేడ్ డీల్‌పై అనిశ్చితి...

**స్వల్పలాభాలతో ముగిసిన భారత స్టాక్ మార్కెట్**

**ఆగస్టు 1... భారత్-అమెరికా ఒప్పందానికి డెడ్ లైన్**

**అయినప్పటికీ సానుకూల ధోరణిలో భారత బెంచ్ మార్క్ సూచీలు**

**మార్కెట్ సెంటిమెంట్‌ను ప్రభావితం చేసిన**

**పలు మొదటి త్రైమాసికం నివేదికలు**



**ముంబై:** బుధవారం నాటి ట్రేడింగ్ సెషన్‌లో భారత స్టాక్ మార్కెట్ మిశ్రమ సంకేతాల మధ్య స్వల్ప లాభాలతో ముగిసింది. ఆగస్టు 1 నాటికి భారత్-అమెరికా వాణిజ్య ఒప్పందం కుదురుతుందా? అనేదానిపై అనిశ్చితి నెలకొన్నప్పటికీ, అమెరికా ఫెడరల్ రిజర్వ్ సమావేశానికి ముందు మార్కెట్ సానుకూల పనితీరును కనబరిచింది. మొదటి త్రైమాసికం ఆదాయ నివేదికలు కూడా మార్కెట్ సెంటిమెంట్‌ను ప్రభావితం చేశాయి.

సెన్సెక్స్ 143.91 పాయింట్లు పెరిగి 81,481.86 వద్ద ముగిసింది. గత సెషన్‌లో 81,337.95 వద్ద ముగిసిన సెన్సెక్స్ 81,594.52 వద్ద మంచి గ్యాప్-అప్‌తో ప్రారంభమైంది. పెట్టుబడిదారుల నుంచి మిశ్రమ స్పందనల మధ్య సూచీ పరిమిత శ్రేణిలో కదలాడింది, ట్రేడింగ్ సమయంలో 81,618.96 వద్ద ఇంట్రా-డే గరిష్ట స్థాయిని తాకింది. నిఫ్టీ 33.95 పాయింట్లు లాభపడి 24,855.05 వద్ద స్థిరపడింది.

సెన్సెక్స్ లో ఎల్ అండ్ టీ, సన్ ఫార్మా, ఎన్టీపీసీ, మారుతి సుజుకి, భారతీ ఎయిర్‌టెల్, ట్రెంట్, యాక్సిస్ బ్యాంక్ లాభపడ్డాయి. టాటా మోటార్స్, పవర్ గ్రిడ్, బజాజ్ ఫిన్‌సర్వ్, మరియు కోటక్ బ్యాంక్ నష్టాల్లో ముగిశాయి.

బ్యాంక్ నిఫ్టీ 71 పాయింట్లు పడిపోయింది. ప్రత్యేకించి పంజాబ్ నేషనల్ బ్యాంక్ మొదటి త్రైమాసికం నివేదికల తర్వాత బ్యాంకింగ్ స్టాక్స్‌లో అమ్మకాలు జరిగాయి. అయితే, నిఫ్టీ ఐటీ, నిఫ్టీ ఎఫ్ఎంసీజీ, నిఫ్టీ ఫిన్ సర్వీసెస్ లాభాలతో ముగిశాయి.

అస్థిరత మధ్య విస్తృత మార్కెట్లు మిశ్రమ సెషన్‌ను అనుభవించాయి. నిఫ్టీ నెక్స్ట్-50, నిఫ్టీ-100 స్వల్పంగా పెరిగాయి, అయితే నిఫ్టీ మిడ్‌క్యాప్-100, నిఫ్టీ స్మాల్‌క్యాప్-100 తగ్గాయి. భారత రూపాయి మే 8 నుంచి అత్యంత ముఖ్యమైన సింగిల్-డే క్షీణతను ప్రదర్శించి, ఐదు నెలల కనిష్ఠ స్థాయికి చేరుకుంది.

# భారత్‌పై అక్కసు.. 25శాతం టారీఫ్, పెనాల్టీ విధించిన ట్రంప్..!



**న్యూయార్క్:** అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ అన్నంత పని చేశారు. రష్యాతో వాణిజ్యం చేస్తున్న దేశాలపై ఆంక్షలు, జరిమానా భారం తప్పదని హెచ్చరించిన ట్రంప్.. భారత్‌పై 25శాతం టారిఫ్ ప్రకటించారు. తాము వారించినా వినకుండా రష్యా నుంచి చమురు కొనుగోలు చేస్తున్నందుకు ఇండియాపై టారీఫ్‌తో పాటు అదనపు పెనాల్టీ కూడా విధించారు.

భారత్ మా మిత్రదేశం అంటూనే కొన్నిసార్లు కఠిన నిర్ణయాలు తీసుకోక తప్పదని బుధవారం అమెరికా ప్రెసిడెంట్ తన సోషల్ మీడియా ఖాతా ట్రుత్ సోషల్ వేదికగా వెల్లడించారు. ఆగస్టు 1వ తేదీ నుంచి భారత్ దిగుమతి చేసుకొనే వస్తువులపై కొత్త టారీఫ్, పెనాల్టీ నిబంధనలు వర్తిస్తాయని ట్రంప్ వెల్లడించారు.

'భారత్ మాకు మిత్ర దేశమే. ఈ విషయాన్ని మేము మరువం. కొన్నేళ్లుగా ఇరుదేశాల మధ్య వ్యాపారం తక్కువ మోతాదులోనే కొనసాగింది. ఎందుకంటే ప్రపంచ దేశాలతో పోల్చితే ఇండియాలో టారీఫ్‌లు ఎక్కువ. భారత్ అనుసరించే వ్యాపార, వాణిజ్య నిబంధనలు కఠినంగా ఉంటాయి. నగదు రహిత వాణిజ్యానికి ఇవి పెద్ద అడ్డంకిగా మారాయి' అని ట్రంప్ పేర్కొన్నారు. అంతేకాదు భారత్, రష్యా మధ్య రక్షణ, ఇంధన పరమైన ఒప్పందాలపై ఆయన స్పందించారు.

### మోడీ ప్రకటన తెల్లారే..

'రష్యా నుంచి భారత్ పెద్ద ఎత్తున తమ సైన్యానికి అవసరమైన ఆయుధాలను కొనుగోలు చేస్తోంది. ప్రస్తుతం ఆ దేశపు ఆయుధాలను భారీగా దిగుమతి చేసుకుంటున్న దేశాల్లో చైనా, ఇండియాదే అగ్రస్థానం. అందుకే భారత్‌పై 25 శాతం టారీఫ్‌తో పాటు పెనాల్టీ కూడా విధిస్తున్నాం. ఆగస్టు 1 నుంచి ఈ కొత్త నిబంధనలు అమల్లోకి వస్తాయి' అని ట్రంప్ వెల్లడించారు. పాకిస్థాన్‌తో యుద్ధం విరమించాలని తమకు ఏ దేశాధినేత చెప్పలేదని ప్రధాని నరేంద్ర మోడీ లోక్ సభలో ప్రకటించిన మరునాడే ట్రంప్ టారీఫ్‌ల మోత మోగించడం గమనార్హం.

# ఇన్ఫోసిస్‌లో 20 వేల ఉద్యోగాలు..

**టీసీఎస్ లేఆఫ్స్ వేళ ఇన్ఫీ కీలక ప్రకటన**




**న్యూఢిల్లీ:** భారత్‌లోని అతి పెద్ద ఐటీ సర్వీసుల సంస్థ టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్ పెద్ద ఎత్తున లేఆఫ్స్ ప్రకటించి ఉద్యోగులకు షాక్ ఇచ్చిన విషయం తెలిసిందే. వచ్చే ఏడాది కల్లా తన మొత్తం ఉద్యోగుల్లో 2 శాతం అంటే దాదాపు 12,200 మంది ఉద్యోగులను తొలగించనున్నట్లు ప్రకటించింది. టీసీఎస్‌లో ఉద్యోగుల తొలగింపు వేల దేశీయ ఐటీ దిగ్గజాల్లో ఒకటైన ఇన్ఫోసిస్ తాజాగా కీలక ప్రకటన చేసింది.

ఈ ఏడాది సుమారు 20 వేల మంది కాలేజ్ గ్రాడ్యుయేట్లను నియమించుకోవాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు వెల్లడించింది. ఓ జాతీయ మీడియాతో ఇన్ఫీ సీఈఓ సలీల్ పరేఖ్ మాట్లాడుతూ ఈ విషయాన్ని వెల్లడించారు. ఇక ఈ ఆర్థిక సంవత్సరం మొదటి త్రైమాసికంలో 17 వేల మందికిపైగా ఉద్యోగులను నియమించుకున్నట్లు తెలిపారు. ప్రస్తుతం ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌పై కంపెనీ ఎక్కువగా దృష్టి సారించినట్లు పేర్కొన్నారు. ఇందులో భాగంగానే భారీగా హైరింగ్‌కు సిద్ధమవుతున్నామని సీఈఓ తెలిపారు.

'ఈ ఏడాది మొదటి త్రైమాసికంలోనే 17 వేల మందికి పైగా నియమించుకున్నాం. మొత్తం 2025 సంవత్సరానికి 20 వేల మంది కాలేజ్ గ్రాడ్యుయేట్లను నియమించుకోవాలని భావిస్తున్నాం. కృత్రిమ మేధసు, డిజిటల్ మార్పులు, తదితర రంగాల్లో ఇన్ఫోసిస్ ఇప్పటికే పెట్టుబడులు పెట్టింది. ఇప్పటివరకు సంస్థ దాదాపు 2.75 లక్షల మంది ఉద్యోగులకు వివిధ స్థాయిల్లో డిజిటల్, ఏఐ నైపుణ్యాల్లో శిక్షణ ఇచ్చింది' అని సీఈఓ వెల్లడించారు.

## ఐసీసీ ర్యాంకింగ్స్.. టీ20 నెంబర్‌వన్ బ్యాట్స్‌మెన్‌గా

# అభిషేక్ శర్మ..




**న్యూఢిల్లీ:** ఐసీసీ టీ20 ర్యాంకింగ్స్‌ను విడుదల చేసింది. భారత స్టార్ ఓపెనర్ అభిషేక్ శర్మ ట్రావిస్ హెడ్‌ను అధిగమించి టీ20ల్లో నంబర్ వన్ బ్యాట్స్‌మన్‌గా నిలిచాడు. వెస్టిండీస్‌తో జరిగిన టీ20 సిరీస్ ఆడకపోవడంతో హెడ్ ఒక స్థానం దిగజారి రెండోస్థానానికి పడిపోయాడు. అభిషేక్ కెరీర్‌లో ఇదే అత్యుత్తమ ర్యాంక్ కావడం విశేషం. అంతే కాదు. టెస్ట్, వన్డే, టీ20 మూడు ఫార్మాట్లలో (బ్యాటింగ్, బౌలింగ్, ఆల్‌రౌండర్) భారత ఆటగాళ్లు ఆధిపత్యం కొనసాగిస్తున్నారు. అభిషేక్‌తో పాటు శుభ్‌మాన్ గిల్ వన్డేలలో నంబర్ వన్ బ్యాట్స్‌మగా ఉండగా.. జస్ప్రీత్ బుమ్రా టెస్ట్ బౌలర్లలో నంబర్ వన్‌గా కొనసాగుతున్నాడు. అదే సమయంలో టెస్ట్ ఆల్ రౌండర్లలో రవీంద్ర జడేజా నంబర్ వన్, టీ20 ఆల్ రౌండర్లలో హార్దిక్ పాండ్యా నంబర్ వన్‌గా ఉన్నారు. జట్టు ర్యాంకింగ్స్‌లో వన్డేలు, టీ20ల్లో భారత జట్టు నెంబర్ వన్‌గా కొనసాగుతున్నది. అభిషేక్ ప్రస్తుతం 829 రేటింగ్ పాయింట్లతో నెంబర్ వన్ స్థానంలో ఉండగా.. ట్రావిస్ హెడ్ 814 రేటింగ్ పాయింట్లతో రెండోస్థానంలో కొనసాగుతున్నాడు.

అభిషేక్ శర్మ ఇప్పటి వరకు టీమిండియా తరఫున 17 టీ20 మ్యాచులు ఆడి 33.44 సగటు 193.85 స్ట్రయిక్ రేట్‌తో 535 పరుగులు చేశాడు. ఇందులో రెండు సెంచరీలు, మరో రెండు హాఫ్ సెంచరీలున్నాయి. బౌలింగ్ చేసి ఆరు వికెట్లు పడగొట్టాడు. విధ్వంసక ఓపెనర్‌గా గుర్తింపు పొందిన అభిషేక్.. టీ20ల్లో కీలక ఆటగాడిగా మారాడు. అదే సమయంలో ఐసీసీ టెస్ట్ ఆల్ రౌండర్లలో రెండవ స్థానంలో ఉన్న బంగ్లాదేశ్‌కు చెందిన మెహదీ హసన్ మీరాజ్ కంటే.. టీమిండియా ఆల్‌రౌండర్ రవీంద్ర జడేజా 117 రేటింగ్ పాయింట్ల ఆధిక్యంలో కొనసాగుతున్నాడు. ఐసీసీ విడుదల చేసిన ప్రకటనలో ఆల్‌రౌండర్ల జాబితాలో నెంబర్ వన్‌గా ఉన్నాడని తెలిపింది. 422 పాయింట్లతో బంగ్లాదేశ్‌కు చెందిన మెహదీ హసన్ మిరాజ్ కంటే 117 పాయింట్లు ముందంజలో ఉన్నాడు. జడేజా ఐదు స్థానాలు ఎగబాకి బ్యాట్స్‌మెన్ ర్యాంకింగ్‌లో 29వ స్థానానికి, బౌలర్లలో ఒక స్థానం 14వ స్థానానికి చేరుకున్నాడు. టెస్ట్ బ్యాట్స్‌మెన్‌లలో వాషింగ్టన్ సుందర్ ఎనిమిది స్థానాలు ఎగబాకి 65వ స్థానానికి చేరుకున్నాడు. మాంచెస్టర్‌లో ఇంగ్లాండ్‌తో జరిగిన నాల్గవ టెస్ట్‌లో జడేజాతో కలిసి ఐదవ వికెట్‌కు 203 పరుగుల భాగస్వామ్యాన్ని నెలకొల్పిన విషయం తెలిసిందే. సుందర్ ఎనిమిది స్థానాలు ఎగబాకి ఆల్ రౌండర్ల జాబితాలో 13వ స్థానానికి చేరుకున్నాడు. ఈ మ్యాచ్‌లో రెండు వికెట్లు కూడా తీసుకున్నాడు. ఇక టెస్టుల్లో జో రూట్ నెంబర్ వన్ బ్యాట్స్‌మెన్‌గా కొనసాగుతుండగా.. న్యూజిలాండ్‌కు చెందిన కేన్ విలియమ్సన్ రెండవ స్థానంలో ఉన్నాడు. ఇంగ్లాండ్‌కు చెందిన హ్యారీ బ్రూక్ మూడో స్థానంలో ఉన్నాడు. ఇంగ్లాండ్‌కు బ్యాటర్ బెన్ డకెట్ ర్యాంకింగ్ 10వ స్థానానికి చేరుకున్నాడు. జాక్ క్రౌలీ 43వ స్థానానికి చేరుకున్నాడు. ఇంగ్లాండ్ కెప్టెన్ బెన్ స్టోక్స్ టెస్ట్ ఆల్ రౌండర్ల జాబితాలో మూడు స్థానాలు ఎగబాకి మూడో స్థానానికి చేరుకున్నాడు. డిసెంబర్ 2022 తర్వాత ఇదే అత్యుత్తమ ర్యాంకింగ్. మాంచెస్టర్‌లో ఇంగ్లాండ్ ఆడిన ఏకైక ఇన్నింగ్స్‌లో రూట్ 150 పరుగుల అద్భుతమైన ఇన్నింగ్స్ ఆడాడు. స్టోక్స్ ఐదు వికెట్లు తీయడమే కాకుండా 141 పరుగులు చేశాడు. బౌలర్లలో నాలుగు సంవత్సరాల తర్వాత టెస్ట్ జట్టులోకి తిరిగి వచ్చిన జోఫ్రా ఆర్చర్ 38 స్థానాలు ఎగబాకి 63వ స్థానానికి చేరుకున్నాడు. క్రిస్ వోక్స్ ఒక స్థానం ఎగబాకి 23వ స్థానానికి చేరుకున్నాడు.

# ఇంగ్లండ్‌కు ఊహించని షాక్.. కెప్టెన్ సహా ఆ నలుగురు ఔట్..!



**మాంచెస్టర్:** అండర్సన్ టెండూల్కర్ ట్రోఫీలో సిరీస్ విజయంపై కన్నేసిన ఇంగ్లండ్‌కు ఊహించని షాక్ తగిలింది. మాంచెస్టర్ టెస్టులో శతకంతో చెలరేగిన కెప్టెన్ బెన్ స్టోక్స్ ఓవల్ టెస్టుకు దూరమయ్యాడు. భుజం గాయంతో బాధ పడుతున్న స్టోక్స్ నిర్ణయాత్మక టెస్టులో ఆడడం లేదని బుధవారం ఇంగ్లండ్, వేల్స్ క్రికెట్ బోర్డు వెల్లడించింది. అంతేకాదు ఓవల్ టెస్టుకు గతంలో సారథ్యం వహించిన అనుభవం ఉన్న ఓలీ పోప్‌ను కెప్టెన్‌గా ఎంపిక చేశారు సెలెక్టర్లు.

స్టోక్స్ దూరమవ్వడంతో తుది జట్టులో భారీ మార్పులు చేశారు సెలెక్టర్లు. మాంచెస్టర్‌లో ఆడిన పలువురికి ఓవల్ టెస్టులో చోటు దక్కలేదు. సీనియర్ పేసర్లు ఆర్చర్, బ్రైడన్ కార్సేతో పాటు ఎనిమిదేళ్ల తర్వాత తొలి మ్యాచ్ ఆడిన స్పిన్నర్ లియామ్ డాసన్‌ను కూడా పక్కన పెట్టేశారు. వీళ్ల స్థానంలో జాకబ్ బెథెల్, గస్ అట్కిన్సన్ జోష్ టంగ్, జేమీ ఓవర్టన్‌లను ఎంపిక చేశారు. పేసర్లకు పెద్ద పీత వేయడం చూస్తుంటే ఓవల్‌లో బౌన్సీ ట్రాక్ సిద్ధం చేశారనే అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి.

**ఇంగ్లండ్ తుది జట్టు:** జాక్ క్రాలీ, బెన్ డకెట్, ఓలీ పోప్(కెప్టెన్), జో రూట్, హ్యారీ బ్రూక్, జాకబ్ బెథెల్, జేమీ స్మిత్(జేమీ స్మిత్), క్రిస్ వోక్స్, గస్ అట్కిన్సన్, జేమీ ఓవర్టన్, జోష్ టంగ్.

మాంచెస్టర్‌లోనే సిరీస్ కైవసం చేసుకోవాలనుకున్న ఇంగ్లండ్‌కు భంగపాటు ఎదురైంది. భారత ఆటగాళ్లు గిల్, రాహుల్, జడేజా, సుందర్‌ల అద్భుత పోరాటంతో మ్యాచ్ డ్రాగా ముగిసింది. దాంతో, అక్కడ చేజారిన విజయాన్ని ఓవల్‌లో సాధించాలనే కసితో ఉన్న ఆతిథ్య జట్టుకు స్టోక్స్ గాయం నిజంగా శరాఘాతమే.

మాంచెస్టర్ టెస్టులో నాలుగో రోజు రాహుల్ వికెట్ తీసిన స్టోక్స్ ఆ తర్వాత ఇబ్బంది పడుతూనే బౌలింగ్ చేశాడు. టీ తర్వాత అతడు అసలు బౌలింగ్‌కే రాలేదు. భారత జట్టు రెండో ఇన్నింగ్స్‌లో 143 ఓవర్లు బ్యాటింగ్ చేయగా.. ఇంగ్లండ్ సారథి రెండు ఇన్నింగ్స్‌ల్లో కలిపి 35 ఓవర్లు వేశాడు. అందువల్లే స్టోక్స్ గాయం తీవ్రత పెరిగి ఉంటుందని వైద్యులు తెలిపారు. బ్యాటింగ్, బౌలింగ్.. ఈరెండింటా ఫామ్‌లో ఉన్న కెప్టెన్ స్టోక్స్ గాయంతో దూరమవ్వడం ఇంగ్లండ్‌కు పెద్ద ఎదురుదెబ్బ.

# దేశం కంటే ఫ్రాంచైజీలకు ఆడడమే నాకిష్టం..

**సిడ్నీ:** ఈ టీ20ల కాలంలో అందరూ ఫ్రాంచైజీ క్రికెట్ ఆడేందుకు ఇష్టపడుతున్నారు. తాజాగా ఓ క్రికెటర్ సైతం తనకు దేశం కంటే ఫ్రాంచైజీలకు ఆడడమే నచ్చుతుందని తెలిపింది. ఆమె ఎవరో కాదు ఆస్ట్రేలియా మహిళల జట్టు స్పిన్నర్ అమంద వెల్లింగ్‌టన్. మామూలుగా కంగారూ జట్టు ఆటగాళ్లు చాలామంది దేశానికే తొలి ప్రాధాన్యం ఇస్తారు. కానీ, ఈమె మాత్రం తనకు ఇంటర్నేషనల్ మ్యాచ్‌లు ఆడడం ఇష్టముండదని వెల్లడించింది.

ఈఎస్‌పీఎన్ క్రిక్‌ఇన్ఫో పవర్ ప్లే పాడ్‌కాస్ట్ ఇంటర్వ్యూలో అమందా అంతేకాదు మానసికంగా ఆరోగ్యంగా ఉండడం, వ్యక్తిగతంగా అన్ని విధాలా సంతృప్తిగా జీవించడం తన తొలి ప్రాధాన్యాలని చెప్పింది. ఇక ఫ్రాంచైజీ క్రికెట్‌ను ఎంచుకోవడం గురించి ఆమె షాకింగ్ కామెంట్స్ చేసింది. తాను ఎందుకు జాతీయ జట్టు సెలెక్షన్స్‌కు దూరంగా ఉంటున్నానో కూడా వివరించింది. 'అంతర్జాతీయ క్రికెట్ ఆడకూడదనేది నేను వ్యక్తిగతంగా తీసుకున్న నిర్ణయం. ప్రస్తుతం టీ20 లీగ్స్ రూపంలో బోలెడన్ని అవకాశాలు ఉన్నప్పుడు జాతీయ జట్టుకే ఆడాలనుకోవడంలో అర్థం లేదు.

నేనైతే దేశం కంటే ఫ్రాంచైజ్ క్రికెట్‌కే ఓటేస్తాను. అలా అనీ నన్ను అపార్థం చేసుకోవద్దు. ఆస్ట్రేలియాకు ఆడడం నిజంగా గొప్ప గౌరవం. అయితే.. మ్యాచ్‌ల కోసం ప్రపంచాన్ని చుట్టి రావడం..పలు ఫ్రాంచైజీలకు ప్రాతినిధ్యం వహించి వివిధ దేశాల క్రికెటర్లతో పరిచయాలు పెంచుకోవడం నాకు చాలా ఇష్టం అని చెప్పిందీ లెగ్ స్పిన్నర్.




2016లో అరంగేట్రం

దేశవాళీ క్రికెట్‌లో అద్భుతంగా రాణించిన అమందా 2016లో అరంగేట్రం చేసింది. 2022 మహిళల వన్డే వరల్డ్ కప్ ఆడిన ఆస్ట్రేలియా జట్టులో సభ్యురాలు తను. ఇప్పటివరకూ ఆమె ఆసీస్ తరఫున 14 వన్డేలు, 8 టీ20లు, ఒకే ఒక టెస్టు మ్యాచ్ ఆడింది. మూడు ఫార్మట్లలో కలిపి 30 వికెట్లు తీసిందంతే. కొన్నాళ్లుగా బిగ్‌బాష్ లీగ్, ది హండ్రెడ్ లీగ్ వంటి ఫ్రాంచైజీ క్రికెట్ లీగ్‌ల మీదనే దృష్టి పెట్టిన అమందా పలు జట్లకు ప్రాతినిధ్యం వహించింది. సదర్న్ వైపర్స్ ఒటాగో, సదర్న్ బ్రేవ్. మాంచెస్టర్ ఒరిజినల్స్, వెస్టర్న్ స్టార్మ్, ఓవల్ ఇన్విజిబుల్స్ జట్ల జెర్సీతో బరిలోకి దిగిందీ స్పిన్నర్.

# వరల్డ్ కప్ హీరోపై వేటు.. లక్నో బౌలింగ్ కోచ్‌గా భరత్ అరుణ్

**లక్నో:** ఐపీఎల్ 19వ సీజన్‌కు ముందే ఆసక్తికర పరిణామాలు చోటు చేసుకుంటున్నాయి. పలు ఫ్రాంచైజీలు పాత కోచింగ్ సిబ్బందిని వదిలించుకోవడమే ఆలస్యం కొన్ని జట్లు వాళ్లతో ఒప్పందానికి సిద్ధమవుతున్నాయి. కోల్‌కతా నైట్ రైడర్స్‌తో తెగతెంపులు చేసుకున్న భరత్ అరుణ్ లక్నో సూపర్ జెయింట్స్ కోచ్‌గా నియమితులయ్యాడు. మూడేళ్లుగా కోల్‌కతా బౌలింగ్ దళాన్ని పర్యవేక్షిస్తున్న ఆయన.. చెన్నై సూపర్ కింగ్స్ టీమ్‌తో కలుస్తాడనే వార్తలు నెట్టింట వైరలయ్యాయి. కానీ, తెలివిగా పావులు కదిపిన సంజీవ్ గొయెంకా బృందం ఆయనతో ఒప్పందం చేసుకుంది. దాంతో, ప్రస్తుతం బౌలింగ్ కోచ్‌గా ఉన్న వరల్డ్ కప్ హీరో జహీర్ ఖాన్‌ను లక్నో వదిలించుకోనుందని తెలుస్తోంది. ఇక .. భరత్ విషయానికొస్తే రెండేళ్ల పాటు ఆయన ఎల్ఎస్జీతో కొనసాగుతాడని సమాచారం. పద్దెనిమిదో సీజన్ ముందు జహీర్ ఖాన్‌తో లక్నో ఏడాది కాలానికి ఒప్పందం కుదుర్చుకుంది. జహీర్ నేతృత్వంలో లక్నో పేస్ యూనిట్ గొప్పగా రాణించలేకపోయింది. పేసర్ల వైఫల్యంతో ప్రత్యర్థులకు భారీ స్కోర్లు సమర్పించుకున్న ఆ జట్టు ప్లే ఆఫ్స్ చేరలేకపోయింది. ఈ నేపథ్యంలో బౌలింగ్ కోచ్‌గా ఈ యార్కర్ కింగ్ కాంట్రాక్టును పొడిగించడానికి సంజీవ్ గొయెంకా టీమ్ సిద్ధంగా లేదు. అందుకే.. అతడి స్థానంలో భరత్ అరుణ్‌ను నమ్ముకోవడమే మంచిదని లక్నో భావించింది. వచ్చే ఏడాది జరుగబోయే 19వ సీజన్‌లో అరుణ్ ఆధ్వర్యంలో తమ బౌలింగ్ దళం గొప్పగా రాణిస్తుందని లక్నో యాజమాన్యం భావిస్తోంది.






### రెండు దఫాలు..

భారత జట్టు బౌలింగ్ కోచ్‌గా సుదీర్ఘ అనుభవం, మంచి ట్రాక్ రికార్డు కలిగిన భరత్.. రెండు దఫాలు భారత జట్టుకు సేవలందించారు. మొదటిసారి 2014 -15 వరకూ బౌలింగ్ దళాన్ని నడిపించిన ఆయన.. రెండో పర్యాయం 2017 జూలై 16 నుంచి 2021 పొట్టి ప్రపంచ కప్ వరకూ కోచ్‌గా పనిచేశారు. ఆయన నేతృత్వంలోనే స్పీడ్‌స్టర్లు జస్ప్రీత్ బుమ్రా, ఇషాంత్ శర్మ, షమీ, ఉమేశ్ యాదవ్‌లు రాటుదేలారు.

## ఫ్యాన్ మూమెంట్.. మెగాస్టార్ చిరంజీవితో మౌనిరాయ్



**టాకీస్:** మెగాస్టార్ చిరంజీవి కథానాయకుడిగా నటిస్తున్న భారీ సోషియో ఫాంటసీ చిత్రం 'విశ్వంభర' ఇటీవలే చిత్రీకరణ పూర్తి చేసుకుంది. దర్శకుడు వశిష్ట తెరకెక్కిస్తున్న ఈ సినిమా షూటింగ్ ఒక ప్రత్యేక గీతంతో ముగిసినట్లు మేకర్స్ ప్రకటించారు. ఈ పాటలో చిరంజీవితో పాటు బాలీవుడ్ నటి మౌని రాయ్ సందడి చేశారు. తాజాగా, సెట్స్ పై చిరంజీవితో మౌని రాయ్ కలిసున్న ఫొటో విడుదలైంది. ఇందులో చిరు స్మార్ట్ లుక్ తో అదరగొడుతున్నారు. మౌనిరాయ్ ఎంతో వినయంగా ఆయన పక్కన నిల్చుని ఉండడం ఈ ఫొటోలో చూడొంచ్చు.

విశ్వంభర' చిత్రాన్ని యూవీ క్రియేషన్స్ పతాకంపై విక్రమ్, వంశీ, ప్రమోద్ నిర్మిస్తున్నారు. ఇటీవలే చిరంజీవి, మౌనిరాయ్ పై స్పెషల్ సాంగ్ షూటింగ్ పూర్తయింది. ఈ పాటకు భీమ్స్ సిసిరోలియో స్వరాలు సమకూర్చగా, కాసర్ల శ్యామ్ సాహిత్యం అందించారు. గణేశ్ ఆచార్య నృత్యరీతులు సమకూర్చిన ఈ పాటను వందమంది డ్యాన్సర్లతో అత్యంత గ్రాండ్‌గా తెరకెక్కించారు. చిరంజీవి తన సిగ్నేచర్ స్టెప్స్‌తో అభిమానులను అలరించడం ఖాయమని చిత్రబృందం చెబుతోంది. ఈ చిత్రం సత్యలోకం నేపథ్యంలో రూపొందుతోందని, బ్రహ్మదేవుడు ఉండే సత్యలోకం కథాంశంతో సినిమా తెరకెక్కుతోందని దర్శకుడు వశిష్ట ఇటీవల ఓ ఇంటర్వ్యూలో వెల్లడించారు. ఈ చిత్రంలో త్రిష, ఆషికా రంగనాథ్ కథానాయికలుగా నటిస్తున్నారు. 'విశ్వంభర' చిత్రానికి ఎం.ఎం. కీరవాణి మరియు భీమ్స్ సిసిరోలియో సంగీతం అందిస్తున్నారు. కథ, రచన, దర్శకత్వం బాధ్యతలను వశిష్ట నిర్వర్తిస్తున్నారు. ఈ చిత్రంపై చిరంజీవి అభిమానుల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి.

## మరోమారు రష్మిక-విజయ్ కాంబో

**టాకీస్:** టాలీవుడ్ స్టార్ నటులు విజయ్ దేవరకొండ, రష్మిక మందన్నా మరోసారి కలిసి నటించబోతున్నట్లు- తెలుస్తుంది. ఇప్పటికే వీరిద్దరి కాంబోలో వచ్చిన గీతా గోవిందం, డియర్ కామ్రేడ్ వచ్చి మంచి విజయాలు అందుకున్నాయి. దీంతో 14గా రాబోతున్న ఈ ప్రాజెక్టును మైత్రీ మూవీ మేకర్స్ బ్యానర్ నిర్మిస్తుండగా.. హిస్టారికల్ బ్యాక్‌డ్రాప్‌లో రాయలసీమ నేపథ్యంలో ఈ చిత్రం రాబోతుంది. ఇప్పటికే పూజ కార్యక్రమాలు పూర్తి చేసుకున్న ఈ చిత్రం త్వరలోనే షూటింగ్



ఈ హిట్ జోడి మళ్లీ తెరపై రోమాన్స్ చేయబోతున్నట్లు- వార్తలు వస్తున్నాయి. టాక్సీవాలా, శ్యామ్ సింగరాయ్ చిత్రాలతో గుర్తింపు తెచ్చుకున్న దర్శకుడు రాహుల్ సాంకృత్యాయన్ విజయ్ దేవరకొండతో సినిమా చేస్తున్న విషయం తెలిసిందే. టాక్సీవాలా తర్వాత వీరిద్దరి కాంబోలో ఈ సినిమా వస్తుండటంతో మంచి అంచనాలు ఉన్నాయి. వీడీ ప్రారంభించనుంది. ఇదిలావుంటే తాజాగా ఈ సినిమాలో కథానాయికకు సంబంధించి ఒక వార్త వైరల్‌గా మారింది. ఈ మూవీలో కథానాయికగా మేకర్స్ రష్మిక మందన్నాని అనుకుంటున్నట్లు సమాచారం. ఒకవేళ ఇదే నిజమైతే ఫ్యాన్స్‌కి పండగనే చెప్పుకోవాలి. కాగా దీనిపై అధికారిక ప్రకటన రావాల్సి ఉంది.

## లాంగ్ గ్యాప్ తరువాత తెలుగు చిత్రాలకు సమంత రెడీ



టాకీస్: సమంత లాంగ్ గ్యాప్ తర్వాత మరో తెలుగు సినిమా చేసేందుకు రెడీ అయింది. గత కొంత కాలంగా బాలీవుడ్ మోజులో టాలీవుడ్ ను పూర్తిగా పక్కన పెట్టేసింది. ఇటీవల నిర్మాతగా మరో అవతారం ఎత్తి తొలి ప్రయత్నంగా అందరు కొత్త నటీనటులతో 'శుభం' అనే చిన్న సినిమాను నిర్మించింది. థియేటర్స్ లో అంతగా మెప్పించని ఈ సినిమా ఓటీటీలో కాస్త సందడి చేసింది. సినిమా నిర్మాణంలో తొలి పెట్టుబడి పెట్టిన సమంతకు ఓటీటీ రూపంలో బాగానే గిట్టు-బాటు- అయింది. మంచి లాభాలు చూసింది. కానీ శుభం కు ముందు సమంత నిర్మాణంలో ఓ సినిమా స్టార్ట్ చేసింది. ఆ సినిమాలో తానె స్వయంగా నటిస్తూ నిర్మిస్తోంది. ఈ చిత్రానికి బేబీ, అలా మొదలైంది చిత్రాల దర్శకురాలు నందిని రెడ్డి దర్శకత్వం వహించనుంది. గతంలో వీరిద్దరి కాంబోలో 2019లో వచ్చిన ఓ బేబీ సూపర్ హిట్ గా నిలిచింది. గతేడాది సమంత బర్త్ డే సందర్భంగా 'మా ఇంటి బంగారం' అనే సినిమా అనౌన్స్ చేసారు. కానీ వివిధ కారణాల వలన ఈ సినిమాను చాలా కాలంగా పక్కన పెట్టేసింది సమంత. అప్పట్లో రిలీజ్ చేసిన గ్లిమ్స్ లో నందిని రెడ్డి - సమంత ఈ సారి వైలెంట్ జానర్ లో వస్తున్నారు అని హింట్ కూడా ఇచ్చారు. అయితే చాలా కాలంగా ఆగిన ఈ సినిమా తిరిగి షూటింగ్ స్టార్ట్ చేసుకోనుంది. ఈ ఏడాది సెప్టెంబరు లో షూట్ స్టార్ట్ చేయబోతున్నారు. షూటింగ్ త్వరగా ఫినిష్ చేసి వచ్చే ఏడాది సమ్మర్ లో రిలీజ్ చేసేందుకు ప్లాన్ చేస్తున్నారు.

## ఉస్తాద్, ఓజీలను పూర్తి చేసే పనిలో పవన్

**టాకీస్:** టాలీవుడ్ స్టార్ యాక్టర్ పవన్ కల్యాణ్ ప్రస్తుతం బ్యాక్ టు- బ్యాక్ సినిమాల్లో నటిస్తున్నాడని తెలిసిందే. పొలిటికల్ కమిట్‌మెంట్స్ కారణంగా ఆలస్యమవుతూ వచ్చిన సినిమాలు ఒక్కోటిగా పూర్తి చేసే పనిలో ఉన్నాడు. ఇప్పటికే విడుదలైన హరిహరవీరమల్లు పార్ట్ 1 బాక్సాఫీస్ వద్ద మిక్సడ్ టాక్ తెచ్చుకుంది. ప్రస్తుతం ఉస్తాద్‌భగత్ సింగ్, ఓజీ సినిమాలను కూడా పూర్తి చేయడంపైనే తన ఫోకస్ అంతా పెట్టాడు.




అయితే కెరీర్‌లో తొలిసారి పవన్ కల్యాణ్ ప్రమోషన్స్‌లో పాల్గొన్నాడని తెలిసిందే. నిర్మాత ఏఎం రత్నం విజ్ఞప్తి మేరకు పవన్ కల్యాణ్ హరిహరవీరమల్లు కోసం ప్రమోషనల్ ఈవెంట్స్‌కు ఎక్కువ సమయం కేటాయించాడు. కాగా సుజిత్ డైరెక్షన్‌లో నటస్తున్న ఓజీ కోసం కూడా ఇదే రూట్‌ను ఎంచుకోబోతున్నాడట. ఓజీపై బజ్‌ను మరింత పెంచేలా ఇంటర్వ్యూల్లో పాల్గొనాలని ప్లాన్ చేస్తున్నట్టు- ఫిలింనగర్ సర్కిల్‌లో ఓ వార్త రౌండప్ చేస్తోంది. మరి ఇదే నిజమైతే సినిమా గురించి ఎలాంటి విషయాలు ప్రేక్షకులు, అభిమానులతో షేర్ చేసుకుంటాడనేది సర్వత్రా ఆసక్తి నెలకొంది. ఈ చిత్రంలో ప్రియాంకా అరుళ్ మోహన్ ఫీ మేల్ లీడ్ రోల్‌లో నటిస్తోంది. ఇమ్రాన్ హాష్మీ, అర్జున్ దాస్, ప్రకాశ్ రాజ్, శామ్, శ్రియా రెడ్డి కీలక పాత్రల్లో నటిస్తున్నారు. డీవీవీ ఎంటర్-టైన్‌మెంట్స్‌పై డీవీ దానయ్య నిర్మిస్తున్నారు. ఓజీకి ఎస్ థమన్ మ్యూజిక్, బ్యాక్ గ్రౌండ్ స్కోర్ అందిస్తున్నాడు. ఓజీ ఈ ఏడాది సెప్టెంబర్ 25న ప్రపంచవ్యాప్తంగా గ్రాండ్‌గా విడుదల కానుంది.

## విజయ్ దేవరకొండ..కింగ్‌డమ్ నేడు విడుదల

**టాకీస్:** విజయ్ దేవరకొండకు చాలా రోజుల తర్వాత మంచి ఛాన్స్ దొరికింది. పైగా ఈ సారి తన వెనక మంచి బ్యాక్ గ్రౌండ్ సపోర్ట్ దొరికింది. విజయ్ కెరీర్ లోనే భారీ బడ్జెట్ తో తీసిన మూవీ కింగ్ డమ్. జులై 31న రిలీజ్ కాబోతోంది. ఎలాంటి పోటీ- ఉండొద్దని రెండు సార్లు వాయిదా వేస్తూ వచ్చారు. వారం కిందట భారీ అంచనాలతో హరిహర వీరమల్లు.. ఇప్పుడు చల్లబడ్డాడు. వీరమల్లుపై మిక్స్ డ్ టాక్ ఉండటంతో ఆ మూవీకి ఆదరణ తగ్గుతోంది. పైగా పదిహేను రోజుల దాకా పెద్ద సినిమాలు లేవు. కింగ్ డమ్ మీద ట్రైలర్ తో భారీగా అంచనాలు పెరిగాయి. టికెట్ రేట్లు- కూడా కొంత వరకు ఏపీలో పెంచారు. కాబట్టి రేట్ల విషయంలో పెద్దగా నెగెటివిటీ- లేదు. సితార సంస్థకు బలమైన బ్యాక్ గ్రౌండ్ ఉంది. అనిరుధ్ వల్ల తమిళ్ లో మార్కెట్ ఏర్పడింది. పైగా గౌతమ్ తిన్ననూరి డైరెక్షన్ వల్ల మూవీపై పాజిటివ్ వైబ్స్ పెరిగాయి. ఇలా అన్ని రకాలుగా కింగ్ డమ్ కు మంచి వాతావరణం ఏర్పడింది. ఏ మాత్రం హిట్ టాక్ వచ్చినా వసూళ్లు భారీగా పెరుగుతాయి. అందులో నో డౌట్. పైగా గురువారం రిలీజ్ అవుతోంది కాబట్టి లాంగ్ వీకెండ్ దొరికింది. ప్రస్తుతం థియేటర్లలో వీరమల్లు, మహావతార్ ఆడుతున్నాయి. వీరమల్లు జోరు తగ్గింది. మహావతార్ ఉన్నా మాస్ ఆడియెన్స్ కింగ్ డమ్ వైపే చూస్తున్నారు. కాబట్టి కొంచెం హిట్ టాక్ తెచ్చుకున్నా విజయ్ కెరీర్ కు ఇది బూస్ట్ అవుతుంది.




Printed , Published & Owned by GADDAMEDI BALARAJU, Printed, at YAGNA PRINTERS AND PUBLICATIONS # 18-105/4,Opp:SBI,Hanumanpet,Malkajgiri (M),Medchal-Malkajgiri District,Telangana State-500047 And Publishedat H. NO: 4-54-246,.Maqdum Nagar, Jagathgirigutta,IDA Jeedimetla,Balanagar Township,Medchal-Malkajgiri ,Telangana-500037 Editor : GADDAMEDI BALARAJU Cell: 9848802025 RNI.No. APTEL/2009/29786.